

బీఈడీ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో జరిగిన బీఈడీ మొదటి సెమిస్టర్ ఫలితాలను కంట్రోలర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు విడుదల చేశారు. ఉపకులపతి డాక్టర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు ఫలితాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు. 3,310 మంది విద్యార్థులు పరీక్షలకు దరఖాస్తు చేసుకోగా 3,115 మంది హాజరయ్యారని తెలిపారు.



అసంపూర్తిగా డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ

ఉర్దూ ఆశలు..!

దేశంలోనే ఏకైక ఉర్దూ విశ్వవిద్యాలయం 'మౌలానా అజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ' హైదరాబాద్‌లో ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఉర్దూ విద్యను అభ్యసించేందుకు ముస్లిం విద్యార్థులు హైదరాబాద్ వెళ్లే పరిస్థితి రాకూడదని 2019కి మునుపు టీడీపీ ప్రభుత్వం కర్నూలులో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటిని ఏర్పాటు చేశారు. ఓర్వకల్లు వద్ద 144 ఎకరాల్లో శాశ్వత భవనాల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. పిల్లర్లు, శ్లాబుల వరకు నిర్మాణాలు జరిగాయి. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల నిర్లక్ష్యం ఉర్దూ వర్సిటీకి శాపంగా మారింది. నిర్మాణాలు అసంపూర్తిగా ఆగిపోయాయి. జగన్ ప్రభుత్వంలో కీలకంగా ఉన్న ఓ మంత్రి ఈ భూములు కొట్టేయాలనే ఎత్తుగడలో భాగంగానే పనులు ఆపేశారనే ఆరోపణలు కూడా వచ్చాయి. మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం రాకతో ఉర్దూ ఉన్నత విద్యను అభ్యాసించే విద్యార్థుల్లో ఆశలు చిగురించాయి. నిర్మాణాల్లో వేగం పుంజుకుంటుందని ఆశిస్తున్నారు. అది జరగాలంటే 2025-26 బడ్జెట్‌లో కనీసం రూ.31.26 కోట్లు కావాలని ప్రతిపాదనలు పంపారు. కర్నూలు, నంద్యాల జిల్లా మైనార్టీ విద్యార్థుల ఉజ్వల భవితను తీర్చిదిద్దే ఉర్దూ వర్సిటీకి మంచి రోజులు వచ్చేనా..? మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్, రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్, రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి దృష్టి సారిస్తారా..? ఆ వివరాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

- ఉర్దూ వర్సిటీకి మంచి రోజులు వచ్చేనా?
- 145 ఎకరాల్లో శాశ్వత భవనాలకు శ్రీకారం
- వైసీపీ హయాంలో నిండా నిర్లక్ష్యం
- జగన్ ప్రభుత్వంలో అటకెక్కిన నిర్మాణాలు
- మళ్లీ చంద్రబాబు ప్రభుత్వంతో ఆశలు
- 2025-26 బడ్జెట్‌లో రూ.31.26 కోట్లు నిధులు కేటాయించాలి

కర్నూలు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన తర్వాత ముస్లింలు ఉర్దూ ఉన్నత విద్యాభ్యాసం కోసం హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండాపోయింది. నవ్యాంధ్రలో అత్యధిక ముస్లిం జనాభా కలిగిన కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉర్దూ విశ్వావిద్యాలయం ఏర్పాటు చేయాలని చంద్రబాబు సంకల్పించారు. రాష్ట్ర విభజన జరిగిన రెండేళ్లకే 2016లో ఏపీ స్టేట్ లెజిస్లేచర్ యాక్ట్-2016 ప్రకారం కర్నూలు నగరంలో 'డాక్టరు అబ్దుల్ హక్ ఉర్దూ విశ్వవిద్యాలయం' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. స్థానిక ఉస్మానియా కళాశాలలో 2017-18 విద్యా సంవత్సరం నుంచి తాత్కాలిక భవనంలో తరగతులు ప్రారంభించారు. ప్రస్తుతం వర్సిటీ తరగతులు, పరిపాలన మొత్తం ఓ ప్రైవేటు భవనంలో కొనసాగుతోంది. వర్సిటీ ప్రారంభంలో ఉర్దూ, ఇంగ్లీష్, ఎకనామిక్స్, కంప్యూటర్స్, ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ విభాగాలు, 150 మంది విద్యార్థులతో ప్రారంభించారు. ఆరేళ్లలో వర్సిటీ ఎంతో అభివృద్ధి చెందింది. తర్వాత 4 పీజీ గ్రూపులు సహా అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు ప్రారంభమయ్యాయి. కర్నూలు, నంద్యాల, చిత్తూరు, కడప, విశాఖపట్నం, ఉభయ గోదావరి జిల్లాల నుంచి 550 మందికి పైగా విద్యార్థులు వివిధ కోర్సులలో పీజీ, డిగ్రీ చదువుతున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర సౌకర్యాలతో ఉర్దూ విద్యాభ్యాసం చేస్తున్న వారు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం. 'అయ్యా..! మా వర్సిటీ కష్టాలు తీర్చండి' అంటూ గత ప్రభుత్వ పాలకులను అడిగితే పట్టించుకోలేదు. అధునాత సౌకర్యాలు, ల్యాబ్‌లు, బాలుర, బాలికలకు ప్రత్యేక హాస్టళ్లు, తాగునీరు, రవాణా.. వంటి సౌకర్యం కల్పిస్తే.. ఢిల్లీ, నోయిడా, హరియాన్, ఉత్తరప్రదేశ్.. వంటి ఉత్తరాది రాష్ట్రాల విద్యార్థులు కూడా వర్సిటీలో చదువుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఆ దిశగా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించి ప్రొత్సాహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



అసంపూర్తి భవనాలు మధ్య పెరుగుతున్న పిచ్చి మొక్కలు

మిగతా 7వ పేజీలో

పీ-4 సర్వేను విజయవంతంగా నిర్వహించండి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పీ-4 సర్వేను విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆయా శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు, డైరెక్టర్లు తదితర ఉన్నతాధికారులతో కలిసి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) గ్రూప్-2 పరీక్షల నిర్వహణ, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ, పీ-4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే అంశాలపై జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పీ-4 సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే నిర్వహణపై సీఎస్ పలు సూచనలు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో పీ-4 సర్వే (పబ్లిక్, ప్రైవేటు, పీపుల్, పార్టనర్‌షిప్) ద్వారా 20 శాతం అత్యంత పేదరికం కలిగిన వాళ్లను గుర్తిస్తామన్నారు. మొదటి దశలో పీ-4 సర్వే జరుగుతున్న జిల్లాలో కర్నూలు జిల్లా కూడా ఒకటని, ఈ నెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు ఈసర్వే చేస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే ఎంపీడీవోలు, గణాంక, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో వెంకటనారాయణమ్మ, సీపీవో హిమప్రభాకర్ రాజు, ఆర్ఐవో ఎస్‌వీఎస్ గురువయ్యశెట్టి తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

ఇంటర్ పరీక్షలపై సమీక్ష

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మార్చి ఒకటో తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలపై కలెక్టర్ రంజిత్ బాషా సంబంధిత అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 69 సెంటర్లలో 45,325 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. ఈ పరీక్షల నిర్వహణకు ఆయా శాఖల అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నపత్రాలు స్టోరేజ్ పాయింట్ నుంచి పరీక్ష కేంద్రాలకు వెళ్లే వరకు పోలీస్ ఎస్కార్ట్ ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించాలన్నారు. పరిసరాల్లో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలని డీఆర్వోను ఆదేశించారు.

స్వల్పంగా పెరిగిన పత్తి ధర

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం పత్తి ధరలు స్వల్పంగా పెరిగాయి. గత వారంతో పోల్చితే క్వింటాకు రూ.150కి పైగా ధర పెరిగింది. పత్తి ధర క్వింటా గరిష్ఠంగా రూ.7,555 పలికింది. కొద్ది రోజులుగా పత్తి ధరలు పతనం అవుతుండడంతో చాలా మంది రైతులు ఇళ్లల్లో తమ పత్తిని నిల్వ ఉంచుకున్నారు. మళ్లీ స్వల్పంగా పత్తిధరలో కదలికలు రావడంతో ధరలపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. 547 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా వాటి కనిష్ఠ ధర రూ.5,399, గరిష్ఠ ధర రూ.7,555, మధ్యస్థంగా రూ.7,369 పలికింది.

రైతుకు నష్టం జరిగితే.. బాధ్యత మీదే

- మద్దతు ధర అందించాల్సిందే
- మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు



కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రైతులకు ఏమాత్రం నష్టం జరిగినా బాధ్యత అధికారులదేనని మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు హెచ్చరించారు. గురువారం కర్నూలు మార్కెట్ యార్డులోని ఏడీఎం కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాలోని మార్కెట్ కమిటీల సెక్రటరీలతో జేడీ రామాంజనేయులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెస్సు వసూళ్ల ప్రభుత్వ లక్ష్యం మేరకు మార్చి చివరికల్లా సాధించాలన్నారు. కోడుమూరు, మంత్రాలయం, ఆలూరు మార్కెట్ కమిటీల్లో సెస్సు వసూళ్లు తగ్గాయని, ఆ మార్కెట్ కమిటీల సెక్రటరీలు మార్చిలోగా లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి పంట ఉత్పత్తికి వ్యాపారుల నుంచి సెస్సు వసూలు జరగాలని, మహాచెక్ పేరుతో అమలు చేస్తున్న కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో వినియోగించాలని ఆదేశించారు. రైతులకు మార్కెట్ యార్డుల్లో ఎటువంటి నష్టం జరగరాదని, కమీషన్ ఏజెంట్లు వ్యాపారులు అక్రమాలకు తావివ్వకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కర్నూలు, నంద్యాల ఏడీఎంలు నారాయణమూర్తి, రెహమాన్, సెక్రటరీలు జయలక్ష్మి, సుందర్‌రాజు, పద్మావతి, సునీత, కార్నలిస్ తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో జీబీఎస్..!

- వైరస్ లక్షణాలతో చేరిన మహిళ
- అందుబాటులో ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు
- అప్రమత్తమైన కర్నూలు వైద్యులు



కర్నూలు హాస్పిటల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా వాసులను కొత్త వైరస్ వణికిస్తోంది. మొన్నటి వరకు మహారాష్ట్ర, తెలంగాణల్లో కలకలం రేపిన గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) ప్రస్తుతం రాష్ట్రంలో కూడా చాపకింద నీరులా వ్యాపించింది. జీబీఎస్ లక్షణాలతో 44 ఏళ్ల మహిళ కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరింది. ఆరు రోజుల క్రితం తీవ్ర జ్వరం, కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఫీమేల్ మెడికల్ వార్డులో ఆమె అడ్మిట్ అయింది. రోగికి పరీక్షలు నిర్వహించగా.. జీబీఎస్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ కావడంతో మహిళను ఏఎంసీ వార్డులో ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుతో కర్నూలు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు అప్రమత్తమయ్యారు. గురువారం సూపరింటెండెంట్ చాంబరులో జీబీఎస్ వ్యాధి నివారణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాధి కలుషిత ఆహారం వల్ల సోకుతుందని, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. జీజీహెచ్‌లో చికిత్సకు అవసరమైన ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు అందుబాటులో ఉన్నాయన్నారు. గులియన్‌బారే సిండ్రోమ్‌కు నోడల్ ఆఫీసర్‌గా మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ డమం శ్రీనివాసులును నియమించారు. ఈ సమావేశంలో సీఎస్ఆర్ఎంవో బి.వెంకటేశ్వర్లు, న్యూరాలజి హెచ్ఓడీ సి.శ్రీనివాసులు, మెడిసిన్ హెచ్ఓడీ ఇక్బాల్ హుశేన్, పీడీయాట్రిక్ అసోసియేట్ ప్రొఫెసర్ రవీంద్రనాథ్ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్లు శివబాల, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

జీబీఎస్ లక్షణాలు

గులియన్ బారే సింద్రోమ్ (జీబీఎస్) వ్యాధి. ఇది ఒక అరుదైన నరాల వ్యాధి. దీన్ని ఆటో ఇమ్యూన్ వ్యాధి అని కూడా అంటారు. శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థ, నరాలపై ఈ వైరస్ దాడి చేస్తుంది. ఫలితంగా కండరాల బలహీనత, గొంతునొప్పి, నడవలేని స్థితి, అలిసిపోయినట్లుగా అనిపిస్తుంది. మొదటి దశలో చికాకు, నడుమునొప్పి ఉంటుంది. పెరాల్సిస్ మాదిరి పాదాలు, చేతులు, ముఖం నిశ్చేష్టంగా ఉంటుంది. చర్మంలో సూదిగుచ్చినట్లుగా అనిపిస్తుంది. కొన్ని కేసుల్లో కండరాలు పూర్తిగా పని చేయకపోవడం గుండె వేగం మారడం, ఊపిరితిత్తుల సమస్యలు సంభవిస్తాయి. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఎదురై వెంటిలేటర్ అవసరం అవుతుంది. ముకం, కంటి కండరాలపై ప్రభావం కొన్ని సందర్భాల్లో ముఖ నరాలు ప్రభావితమవుతాయి.

ఎదుర్కొనేందుకు సిద్ధం



ఎలాంటి విపత్కర పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. జీబీఎస్ వ్యాధి నివారణ కోసం అన్ని ఏర్పాట్లు చేశాం. ఇమ్యూనోగ్లోబిన్ ఇంజెక్షన్లు మందులు అందుబాటులో ఉంచాము. ప్రత్యేకంగా వైద్యులతో నోడల్ కమిటీని ఏర్పాటు చేశాం. ఇది అంటువ్యాధి కాదు. ప్రజలు ఈ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి.

\- డాక్టర్ కె.వెంకటేశ్వర్లు, సూపరింటెండెంట్, కర్నూలు జీజీహెచ్





భృంగిపై శ్రీశైలేశుడు

- బ్రహ్మోత్సవాలతో పరవశించిన శ్రీగిరి
- ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు

శ్రీశైలం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైలం మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండోరోజు గురువారం అర్ధనారీశ్వర రూపానికి మూలకారకుడైన భృంగి భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామివార్ల సేవలో తరించారు. భృంగి వాహనంపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆశీనులనుజేసి సుగంధ పుష్పాలతో అలంకరించారు. అనంతరం స్వామిఅమ్మవార్లను క్షేత్ర పురవీధుల్లో విహరింపజేశారు. అశేష భక్తజనం ఈ అద్భుత ఘట్టాన్ని కనులారా వీక్షించి పరవశించారు. గ్రామోత్సవం ముంగిట కోలాటం, చెక్కభజన, గొరవయ్యాల, బుట్టబొమ్మల నృత్యాలు, బీరప్పడోలు, బంజార నృత్యం, తప్పెట్లు, శంఖునాదాలు, మంగళవాయిద్యాలతో కొనసాగింది. ఆలయ రాజగోపురం నుంచి గంగాధర మంటపం మీదుగా బయలు వీరభద్రస్వామి ఆలయం వరకు గ్రామోత్సవం కొనసాగింది. వేలాదిగా తరలివస్తున్న భక్తులతో శ్రీగిరి కిక్కిరిసింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు ముమ్మర చర్యలు చేపట్టారు.

మిగతా 6వ పేజీలో



భృంగివాహనంపై ఆది దంపతుల విహారం



పట్టువస్త్రాలకు స్వాగతం పలుకుతున్న ఆలయ అధికారులు



గ్రామోత్సవం ఎదుట కోలాటాల ప్రదర్శన



కేరళ కళాకారుల సంప్రదాయ నృత్యం



డోలు వాయిద్య కళాకారుల ప్రదర్శన

ఆత్మకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బహ్మోత్సవాలను పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి భక్తులు కాలినడకన శ్రీశైలానికి తరలివెళ్లడంతో నల్లమల గిరులన్నీ శివనామ స్మరణతో ప్రతిధ్వనిస్తున్నాయి. ఎండలను సైతం లెక్కచేయకుండా పిల్లాపాపలను వెంటపెట్టుకుని శివశివ.. హరహర అంటూ దుర్భేద్యమైన కొండల్లో శ్రీశైలానికి పాదయాత్ర సాగిస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కోడుమూరు, ఎమ్మిగనూరు, ఆదోని, నందికొట్కూరు, డోన్, కర్నూలు తదితర ప్రాంతాల నుంచే కాకుండా అనంతపురం, మహబూబ్‌నగర్ జిల్లాల నుంచి పాదయాత్రికులు పెద్దసంఖ్యలో శ్రీశైల క్షేత్రానికి తరలివెళ్తున్నారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు, శివస్వాములు ప్రైవేటు వాహనాలు, ఆర్టీసీ బస్సుల ద్వారా ఆత్మకూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామానికి చేరుకుని అక్కడి నుంచి శ్రీశైలానికి పాదయాత్ర సాగిస్తున్నారు. మరికొంత మంది వారి స్వగ్రామాల నుంచే పాదయాత్రగా తరలివస్తున్నారు.


నాగలూటి మెట్లను ఎక్కుతూ మల్లన్న సన్నిధికి చేరుకుంటున్న భక్తులు

నల్లమల గిరులు.. ఓంకార ధ్వనులు



- మల్లన్న స్మరణలతో కొండకోనలు దాటుకుంటూ..
- మరచిపోలేని మజిలీ.. శ్రీశైలం పాదయాత్ర
- పిల్లాపాపలతో మల్లన్న చెంతకు చేరుతున్న పాదయాత్రికులు
- సుదూర ప్రాంతాల నుంచి తరలివస్తున్న కాలినడక భక్తులు

మరచిపోలేని మజిలీ.. శ్రీశైలం పాదయాత్ర

భూలోక కైలాసంగా విరాజిల్లుతున్న శ్రీశైల క్షేత్రానికి పాదయాత్రగా తరలివెళ్లడం జీవితంలోనే మరచిపోలేని మజిలీగా చెప్పవచ్చు.

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో శ్రీశైలానికి జిల్లా నలుమూలల నుంచే కాకుండా ఇతర జిల్లాలకు చెందిన భక్తులు పాదయాత్రగా తరలివస్తున్నారు. కొందరు ఏకంగా తమ స్వగ్రామాల నుంచే నేరుగా శ్రీశైలానికి కాలినడకన వెళ్తుండగా మరికొంత మంది భక్తులు ఆత్మకూరు మండలం వెంకటాపురం గ్రామానికి వాహనాల్లో చేరుకుని అక్కడి నుంచి పంటపొలాల గుండా నాగలూటి చెంచుగూడేన్ని చేరుకుని ఆ తర్వాత 5 కిలోమీటర్ల అటవీ మార్గంలో ప్రయాణించి నాగలూటి వీరభద్రాలయానికి సందర్శించి అక్కడి నాగలూటి తిప్పలు, దామర్ల కుంట, నల్లమల కొండలపై అడవిమార్గం గుండా సుమారు 14 కిలోమీటర్లు భక్తులు ప్రయాణించి పెచ్చెర్వు చెంచుగూడేన్ని చేరుకుంటున్నారు. అక్కడి నుంచి కత్తుల కొండ, కోర్కెలకొండ అటవీ ప్రాంతంలో 15 కిలోమీటర్లు ప్రయాణిస్తే.. భీముని కొలను ప్రాంతానికి చేరుకుంటున్నారు. అక్కడి నుంచి ప్రమాదకర జారుడు కొండపై ప్రయాణించి కైలాస ద్వారానికి చేరుతున్నారు. 6 కిలోమీటర్లు దూరం ప్రయాణించి శ్రీశైల మల్లన్న దర్శనానికి తరలివెళ్తున్నారు. ఇదిలావుంటే పాదయాత్రలో భాగంగా నాగలూటి మెట్లు, అడవి అందాలు, మార్గమధ్యలో ప్రాచీన కట్టడాలు, పెచ్చెర్వులో ఆదిమ చెంచుల జీవన విధానాలు భక్తులకు కనువిందు చేస్తున్నాయి.

దారిపొడవునా ఆచారాలు

శ్రీశైలానికి కాలినడకన తరలివెళ్తే పాదయాత్రికులు దారిపొడవునా ఆచారాలు పాటిస్తూ తమ యాత్రను కొనసాగిస్తున్నారు. వెంకటాపురం నుంచి పాదయాత్ర కొనసాగించే భక్తులు తొలుత గోసాయికట్ట ఆంజనేయస్వామిని దర్శించుకుంటారు. ఆ తర్వాత నాగలూటి వీరభద్రస్వామిని దర్శించుకుని మెట్ల మార్గం గుండా బయలుదేరుతారు. అక్కడి నుంచి దామర్లకుంట మీదుగా పెచ్చెర్వుకు చేరుకుని అటునుంచి వెళ్లే క్రమంలో కోర్కెలకొండలో సంతానం కోసం చెట్లకు ఊయలు కట్టడం, సొంతింటి కలలు నెరవేరాలని ఆకాంక్షిస్తూ ఒకదానిపైఒకటి రాళ్లను అమర్చి కోర్కెలు కోరుకోవడం జరుగుతోంది. అక్కడి నుంచి సీతమ్మబావిని సందర్శించి ఆ తర్వాత భీముని కొలనుకు చేరుకుని అక్కడ భీముడి విగ్రహాన్ని దర్శించుకుంటారు. ఆ తర్వాత కైలాస ద్వారాన్ని చేరుకున్న అనంతరం హఠకేశ్వరాలయాన్ని, సాక్షిగణపతిని దర్శించుకుని మల్లన్న సన్నిధికి చేరుకుంటారు.


ప్రాచీన కట్టడం వద్ద పాదయాత్రికులు


భీముని కొలను వద్ద పాదయాత్ర


కోర్కెలకొండలో కొనసాగుతున్న ఆచారాలు

నల్లమల అందాల నడుమ మల్లేశ్వరుడు

- గుహల్లో వెలసిన దేవతామూర్తులు
- శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి విగ్రహాలు
- శివరాత్రికి ముస్తాబైన భైరవ, మలయచల క్షేత్రాలు


మలయచల వద్ద గుహలో మల్లేశ్వరుడు

చాగలమర్రి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లమల ప్రకృతి సోయగాల నడుమ వెలసిన భైరవ, మలయచల ఆలయాలు పర్యాటకులను ఆకట్టుకుంటున్నాయి. శ్రీకృష్ణదేవరాయల కాలం నాటి భైరవేశ్వర, మలయచల మల్లేశ్వర ఆలయాలు ఉన్నాయి. రాచరికపు గుర్తులు ఉన్న అతి పురాతన ఆలయాలు ఇవి. వీటి సమీపంలో తెలుగుగంగ జలాశయం పర్యాటకులను ఆకర్షిస్తోంది. మండలంలోని చింతలచెరువు గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో మూడు కిలోమీటర్ల దూరంలో శ్రీకృష్ణదేవరాయల కాలంలో భైరవేశ్వర ఆలయాన్ని నిర్మించారు. నల్లమల కొండల మధ్య మలయచల మల్లేశ్వరుడు గుహల్లో వెలిశాడు. ఇక్కడ ఈశ్వరుడు, వేణుగోపాలస్వామి, వీరభద్రస్వామి, పార్వతిదేవి, ఈతర దేవతా విగ్రహాలు కొలువుదీరి ఉన్నాయి. ముఖ్యంగా ఉమామహేశ్వర విగ్రహాలు ఉండటం ఇక్కడి ప్రత్యేకత. 500 సంవత్సరాల క్రితం మల్లేశ్వరుడు కొలువుదీరినట్లు క్షేత్ర చరిత్రను బట్టి తెలుస్తోంది. ఈ ప్రాంతంలో 5 పెద్ద గుహలు ఉన్నాయి. ఈ గుహల్లోకి ఎవరూ వెళ్లే సాహసం చేయలేదు. ఆ గుహల్లో నిధులు ఉన్నట్లు వదంతులు ఉన్నాయి. నల్లమల సోయగాల నడుమ తెలుగుగంగ కాలువ, మినీ రిజర్వాయర్ ఉండటం ఈ ప్రాంతానికి ఎంతో శోభనిస్తోంది. ఈ నెల 26న శివరాత్రి ఉత్సవాలకు ఈ క్షేత్రాలను ముస్తాబు చేశారు.

మలయచలకు వెళ్లాలంటే..

మలయచల ప్రాంతానికి వెళ్లాలంటే చాగలమర్రి నుంచి 5 కిలోమీటర్ల దూరంలో ఉన్న కదిరిపురం తండాకు వెళ్లాలి. అక్కడి నుంచి నల్లమల అటవీ ప్రాంతంలో 3 కిలోమీటర్లు నడిచి వెళ్తే అక్కడికి చేరుకోవచ్చు. చాగలమర్రి నుంచి చింతలచెరువు గ్రామానికి వెళ్లి అక్కడి నుంచి భైరవేశ్వర ఆలయం మీదుగా తెలుగుగంగ ప్రధాన కాలువపై నుంచి వెళ్తే మలయచల క్షేత్రానికి చేరుకోవచ్చు.

ఏడాదికోసారే శివయ్య దర్శనం!

- అభయారణ్యంలో గుండ్ల బ్రహ్మేశ్వరుడు
- దట్టమైన అడవిలో అద్భుతమైన ఆలయం


బ్రహ్మేశ్వరుడు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా పరమేశ్వరుడికి నిత్యపూజలు, జలాభిషేకాలు, తదితర పూజా కైంకర్యాలు నిర్వహిస్తుంటారు. కానీ నల్లమల అటవీ క్షేత్రంలోని ఓ ఆలయంలో మాత్రం శివయ్య ఏడాది ఒక్కసారే దర్శనమిస్తారు. అభయారణ్యం నడుమ ఉన్న ఆ క్షేత్రమే గుండ్ల బ్రహ్మేశ్వరం. ఇక్కడ కొలువైన గుండ్ల బ్రహ్మేశ్వరుడిని దర్శించుకోవాలంటే ప్రతి ఏటా వచ్చే శివరాత్రి రోజు మాత్రమే వెళ్లాల్సి ఉంటుంది. బండిఆత్మకూరు మండల పరిధిలోని దట్టమైన నల్లమల నట్టడవిలో గుండ్ల బ్రహేశ్వర క్షేత్రం ఉంది. ఈ క్షేత్రంలో వెలసిన బ్రహ్మేశ్వరుడు, రాజరాజేశ్వరీ, వీరభద్రుడు కేవలం ఏడాదికొకసారే భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఆలయాన్ని చాళుక్యుల కాలంలో నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనాల ద్వారా తెలుస్తోంది. ఇక్కడి శివలింగాన్ని అశ్వత్థాముడు ప్రతిష్ఠ చేసినట్లు ప్రతీతి. మహాభారత కాలంలో పాండవులను సంహరించాలని దుర్యోధనుడు అశత్థాముడిని ఆదేశిస్తే అంతట పాండవులనుకొని ఉపపాండవులైన బ్రాహ్మణులను సంహరించి తప్పిదం చేస్తాడు. ఈ విషయం తెలుసుకుని శ్రీకృష్ణుడి వద్దకు వెళ్లి జరిగిన ఘోరాన్ని వివరించి పాపపరిహార అడుగగా కోటి శివలింగాలను ప్రతిష్ఠించాలని ఆ వాసుదేవుడు సూచిస్తాడు. దీంతో అశ్వత్థాముడు నల్లమల అటవీప్రాంతంలోని గుండ్లకమ్మ నది వద్ద ఘోర తపస్సు ఆచరించి శివలింగాన్ని ప్రతిష్ఠించారని ఇతిహాసాల ద్వారా తెలుస్తోంది. గుండ్లకమ్మనదీ తీరాన ఉంటంతో గుండ్లబ్రహ్మేశ్వరంగా ఈ ప్రాంతం ప్రాచుర్యం పొందింది.

బ్రిటీష్ పాలకుల భవనాలు



దట్టమైన అభయారణ్యం ఉన్న ఈ ప్రాంతంలో బ్రిటీష్ పాలనా కాలంలో అంటే 1915 సంవత్సరంలో అటవీ రేంజ్ కార్యాలయం, గెస్టుహౌస్‌ను నిర్మించారు. 1945లో అప్పటి రేంజ్ అధికారి చోళీరు నంజప్ప అక్కడ తీగలపొదలతో కప్పిపోయి ఉన్న ఓ నిర్మాణాన్ని చూశాడు. ఈ విషయాన్ని నారాయణపురం, చిన్నదేవళాపురం గ్రామస్థులకు తెలిపి వారి ద్వారా తీగలను తొలగించి పరిశీలించగా శివాలయం బయటపడింది. నాటి నుంచి ఆవులపాటి పెద్దపుల్లయ్య, బోయ లింగన్న.. అర్చకుడు పెద్దయ్యగారి వెంకట శేషయ్యతో ఏటా శివరాత్రి పర్వదిన ఉత్సవాలు కలిసి నిర్వహిస్తున్నారు. ఈ ఆలయానికి చేరుకోవాలంటే నంద్యాల జిల్లా నారాయణపురం, వెలుగోడు, దిగువమెట్ట ప్రాంతాల నుంచి, ప్రకాశం జిల్లా పాపినేనిపల్లె నుంచి ఎటు వైపు నుంచి వెళ్లినా 42 కిలో మీటర్లు కాలినడకన, ట్రాక్టర్లు, జీపులలో ప్రయాణించి దర్శించుకోవాల్సి ఉంటుంది. ఈ క్షేత్రం ఉన్న గుండ్ల బ్రహ్మేశ్వరం రేంజ్‌ను వణ్యప్రాణి అభయారణ్యంగా గుర్తించటంతో కేవలం ఈ ఆలయ దర్శనం ఏడాదికొకసారి శివరాత్రి పర్వదినాన మాత్రమే కొనసాగుతోంది.

ఈ ఏడాది ఆలయ కమిటీ పెద్దలు జయన్న, శంకర్, నారాయణ, రాముడు ఈ నెల 26, 27 తేదీల్లో శివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. అందుకోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. నారాయణపురం నుంచి ట్రాక్టర్ ద్వారా కొంత దూరం చేరుకోవాలి. అక్కడి నుంచి భక్తులు 10 కిలోమీటర్ల మేర కాలినడకన అటవీమార్గం నుంచి గుండ్లబ్రహ్మేశ్వరం చేరుకోవాల్సి ఉంటుంది. శివరాత్రి రోజున వచ్చే భక్తులకు భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు. అడవిలోకి అగ్గిపెట్టె, సిగరెట్లు, బీడీలు, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించారు.


వీరభద్రుడు

వామ్మో.. ఘాట్ రోడ్డు ప్రయాణమా..?

- ప్రమాదకర మలుపుల నల్లమల
- వాహనం కండీషన్ కీలకం
- రహదారి నియమాలు పాటించకపోతే ప్రమాదాలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల క్షేత్రంలో జరుగుతున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనదారులు నల్లమల ఘాట్‌రోడ్‌లో అప్రమత్తంగా వ్యవహరించాల్సి అవసరం ఉంది. రహదారి నియమాలు పాటించకపోవడం, వాహనాలు కండీషన్ లేకపోవడంతో వంటి సమస్యలు చోటు చేసుకుంటే ప్రమాదాలకు తావిచ్చే అవకాశం ఉంటుంది. అదేవిధంగా సుదూర ప్రాంతాల నుంచి తరలివచ్చే వాహనాలకు నల్లమల అటవీ ప్రాంతంలో మరమ్మతులు చోటు చేసుకుంటే అటవీ ప్రాంతంలో అగచాట్లను ఎదుర్కోక తప్పదు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు తప్పనిసరిగా తమ వాహనాలను మంచి కండీషన్‌లో ఉంచుకోవాలని రవాణా శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా గూడ్స్ వాహనాల్లో భక్తులు తరలిరాకుండా జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. అసలే నల్లమల ఘాట్‌రోడ్‌లో అనేక మలుపులు ప్రమాదకరంగా ఉంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదాలు చోటు చేసుకుంటే పెను నష్టం సంభవించే అవకాశాలు ఉన్నాయి.


అటవీ ప్రాంతంలో ప్రయాణిస్తున్న వాహనాలు

వాహనాన్ని ఉంచుకోండి ఇలా..

- నల్లమలలోని ఘాట్‌రోడ్డు దిగేటప్పుడు కేఎంపీఎల్ మిగుల్చుకోవాలన్న ఉద్దేశంతో గేర్లను న్యూట్రల్ చేయవద్దని సూచిస్తున్నారు. ఇలా వేగంగా ఘాట్ దిగే వాహనాలకు ఎదురుగా మరోవాహనాలు వస్తే.. బ్రేక్ వేసేందుకు ఇబ్బందిగా ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో బ్రేక్‌ఫెయిల్ సంభవించవచ్చు. ఘాట్‌రోడ్డులో గేర్‌న్యూట్రల్ చేయరాదు.
- సాధ్యమైనంతవరకు నల్లమల అటవీ ప్రాంతంలోని ఘాట్‌రోడ్డు మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్లాలి.
- వాహనం బయలుదేరే ముందు బ్రేక్, స్టీరింగ్ ప్లే, సైడ్‌మిర్రర్లు, డ్రైవర్ డోర్‌లాక్స్, డీజల్‌మీటర్లు, టైర్లలో గాలి, డీజిల్ లీకేజీ, ఇంజన్ ఫ్యాన్ బెల్ట్, క్లచ్ పెడల్‌ప్లేట్, చక్రాలకు బోల్టులు సరిచూసుకోవాలి. హ్యాండ్‌బ్రేక్‌ను పరిశీలించాలి.
- రాత్రివేళల్లో బ్రేక్‌లైట్లు, సైడ్‌ఇండికేటర్స్, డిమ్‌డిప్పర్ లాంటి సూచికలు పనిచేస్తున్నాయో లేదో సరిచూసుకోవాలి.
- అదేవిధంగా ఎయిర్‌లాక్ జరగకుండా జాగ్రత్తలు పాటించాలి. ఇంజన్ హీట్ జరగకుండా రేడియేటర్‌లో నీటిని నిల్వ వుంచేలా జాగ్రత్తలు చేపట్టాలి.

- వాహనం మరమ్మత్తులకు గురైతే మైనర్ రిపేర్లకు అవసరమయ్యే పరికరాలను వాహనంలో అందుబాటులో వుంచుకోవాలి. అలాగే గాలితో నింపబడిన ఒక టైర్‌ను అందుబాటులో ఉంచుకోవాలి.

రహదారి నియమాలు పాటించాలి

మహాశివరాత్రి పర్వదినాన్ని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీశైల మహాక్షేత్రానికి ప్రతిరోజు వేలాది సంఖ్యలో వాహనాలు తరలివస్తాయి. ఈనేపథ్యంలో నల్లమల ఘాట్‌రోడ్డులో ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వాహనచోదకులు తప్పనిసరిగా రహదారి నియమాలు పాటించాలి. అలాగే ప్రయాణంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వీలైంతవరకు రాత్రి వేళల్లో ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలి. డ్రైవర్లు సరైన విశ్రాంతి లేకపోతే నిద్రమత్తుకు లోనై ప్రమాదం జరిగే ఆస్కారం ఉంటుంది. ఘాట్ రోడ్డులో అనుభవజ్ఞులైన డ్రైవర్లు డ్రైవింగ్ చేయడం ఉత్తమం. ప్రత్యేకించి గూడ్స్ వాహనాల్లో ప్రయాణం ప్రమాదం. అందుకే గూడ్స్ వాహనాల్లో వెళ్లే ప్రయాణికులను నిలిపివేస్తున్నాము. వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా రద్దు చేసేలా చర్యలు చేపట్టాము.



- సత్యనారాయణరెడ్డి, మోటర్ వెహికల్ ఇన్స్‌పెక్టర్, ఆత్మకూరు

ఘాట్‌రోడ్‌లో వాహనం కండీషనే కీలకం



శ్రీశైలానికి వెళ్లే దారిలోని నల్లమల ఘాట్‌రోడ్డులో వాహనం తప్పనిసరిగా కండీషన్‌లో ఉంచుకోవాలి. బయలుదేరే ముందే ఆయా సమస్యలపై పరిశీలన చేసి ఏవైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలి. వాహనం కండీషన్ దెబ్బతింటే ప్రమాదాలు జరిగే అవకాశంతో పాటు అటవీ ప్రాంతంలోనే అవస్థలు ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రత్యేకించి ఘాట్‌రోడ్ దిగే క్రమంలో గేర్‌ను న్యూట్రల్ చేయకుండా వెళ్లడం మంచిది. మలుపుల వద్ద జాగ్రత్తగా డ్రైవింగ్ చేయాలి.

- బీఎన్ అహ్మద్, సీనియర్ డ్రైవర్, ఆత్మకూరు ఆర్టీసీ డిపో


పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

భృంగిపై శ్రీశైలేశుడు

(5వ పేజీ తరువాయి)

ద్వారకా తిరుమల నుంచి పట్టువస్త్రాలు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు ద్వారకా తిరుమల వేంకటేశ్వరస్వామి దేవస్థానం తరఫున ఆలయ ఈఓ కె.సత్యనారాయణమూర్తి, ఏఈఓ పి.నటరాజరావు, అర్చకులు భాను, వేదపండితులు సోమశేఖరశర్మ, వెంకటేశ్వరశర్మ పట్టువస్త్రాలను సమర్పించారు.

నేడు హంసవాహన సేవ : బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడోరోజైన శుక్రవారం స్వామిఅమ్మవార్లు హంసవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారు. అదేవిధంగా స్వామి, అమ్మవార్లకు విజయవాడ ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర స్వామిఅమ్మవార్ల దేవస్థానం తరుపున పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా దేవస్థానంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. నిత్యాకళారాధన వేదిక, పుష్కరిణి ప్రాంగణంలోని భ్రామరీకళావేదిక, శివదీక్షాశిబిరాల ప్రాంగణంలో గురువారం సాయంత్రం సంప్రదాయ నృత్యప్రదర్శన, జానపద నాటకాలను ప్రదర్శించారు.


నృత్యం చేస్తున్న మహిళలు


వేషధారణలో కళాకారుడు

అమ్మ భాష.. ఆయన శ్వాస

ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే
జడ్పీ ప్రభుత్వ ఉద్యోగి కృష్ణారెడ్డి ప్రస్థానం
నేడు మాతృభాష దినోత్సవం



2013లో నాటి అధికార భాష సంఘం చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందుకుంటూ..





కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంస్కృతీ, సంప్రదాయంతో పాటు మంచి నడవడిక నేర్పేది మాతృభాష. తల్లి ఒడే బిడ్డకు తొలిబడి. అమ్మ మాటే మాతృభాష. తల్లి భాష లేనిదే మానవజాతికి వికాసం లేదు. ఇతర భాషలు ఎన్ని నేర్చుకున్నప్పటికీ... మాతృభాషలో ప్రావీణ్యుడు కానివాడు విజ్ఞాన సముపార్జన చేయలేడు. అలాంటి తల్లిభాష నేడు తల్లడిల్లుతోంది. పాశ్చాత్య పోకడల మాటున అమ్మభాషకు విఘాతం కలుగుతోంది. జీవితంలో పైకి ఎదగాలంటే ఇతర భాషలను నేర్చుకోక తప్పదు. కానీ వాటి ప్రభావం మాతృభాషపై పడకుండా చూసుకోవాలి. మన మాతృభాషను మనమే రక్షించుకోవాలి. బాల్యం నుంచి మాతృభాషను క్షుణ్ణంగా నేర్చుకోవాలని, అప్పుడే మనిషి సంపూర్ణతను సాధిస్తాడని అంటున్నారు. తెలుగు భాషాభిమాని, పంచాయతీరాజ్ పీఐయూ కర్నూలు డివిజన్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా పనిచేస్తున్న జీవీ కృష్ణారెడ్డి. ఆయన అధికారిక హోదాలో ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ తెలుగులోనే ఇస్తున్నాడు. తెలుగు భాషపై ఈయనకున్న అభిమానాన్ని గుర్తించిన ప్రభుత్వం 2016లో ఉత్తమ అధికారిగా గుర్తించింది. నేడు అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

టంగుటూరు పట్టణానికి చెందిన గ్రంథి హనుమంతు, ఈశ్వరమ్మ దంపతులకు జన్మించిన జీవీ కృష్ణారెడ్డి ఎంఏ బీఈడీ చదివారు. క్రిష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించి సీ.బెళగల్, కర్నూలు జిల్లా పరిషత్ కార్యాలయంలో విధులు నిర్వహించారు. జడ్పీలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మాతృభాష పట్ల ఆయన చేసిన కృషి గుర్తించిన అప్పటి జడ్పీ సీఈవో సూర్యప్రకాష్ ప్రోత్సహించారు. జడ్పీలోని ఉద్యోగులు, ఉత్తర, ప్రత్యుత్తరాలన్నీ మాతృభాషలోనే జరపాలని స్వయంగా ఆచరించారు. జీవీ కృష్ణారెడ్డికి మాతృభాషంటే ఎనలేని గౌరవం, ఉగ్గుపాలతో నేర్చుకున్న తెలుగుపై మమకారం పెంచుకున్నారు. రాబోయే కాలంలో ఆ మాతృభాష గొప్పదనం అందించాలనే ధ్యాస. అందుకే సాధ్యమైనంత వరకు మమ్మీ, డాడీ, అంకుల్, ఆంటీ అనే ఆంగ్ల పిలుపులకు చరమగీతం పాడాలని, అమ్మ, నాన్న, అత్త,మామ అనే పలకరింపులోని తియ్యదనాన్ని ఆస్వాదించాలని నిరంతరం పరితపిస్తున్నారు. క్రిష్ణగిరి మండల పరిషత్ కార్యాలయంలో 2013లో పరిపాలన అధికారిగా పదోన్నతి పొంది 3 సంవత్సరాలు ఇన్‌చార్జి ఎంపీడీఓగా పనిచేశారు.

ప్రస్తుతం కృష్ణారెడ్డి పంచాయితీరాజ్ కర్నూలు డివిజన్ కార్యాలయంలో పరిపాలన అధికారిగా సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ పత్రాలన్నింటిని అమ్మభాషలో తయారు చేస్తున్నారు. దీంతో ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందడమే కాకుండా 2013 సంవత్సరం ఫిబ్రవరి 21న అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధికార భాష సంఘం చైర్మన్ మండలి బుద్ధప్రసాద్ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

అమ్మభాషను మరువరాదు



అమ్మ అనే పిలుపులో ఎంతో మాధుర్యం ఉంది. పుట్టుకతో వచ్చిన తల్లి భాషను మరచిపోతే మనుగడ ఉండదు. మారుతున్న కాలానికి అనుగుణంగా తల్లిదండ్రులు కూడా ఆంగ్లంలో తమ పిల్లలు మాట్లాడుతుంటే సంబరపడుతూనే ఉంటారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలకు చిన్నతనం నుంచే మాతృభాష పట్ల మమకారం పెరిగేలా కృషి చేయాలి.

- జీవీ కృష్ణారెడ్డి, పరిపాలన అధికారి, కర్నూలు

ఉర్దూ ఆశలు..!



కంకర తేలిన యూనివర్సిటీ ప్రధాన రోడ్డు

(5వ పేజీ తరువాయి)

ప్రభుత్వాలు శాశ్వతం కాదు. చేసిన అభివృద్ధి పనులే శాశ్వతం. ఏ ప్రభుత్వం వచ్చినా ముందు ప్రభుత్వం చేపట్టిన పనులు కొనసాగించాలి. అయితే ఇందుకు విరుద్ధంగా గత వైసీపీ ప్రభుత్వం వ్యవహరించింది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు ప్రభుత్వం రాష్ట్రానికి ఉర్దూ యూనివర్సిటీ ఉండాలనే మహోన్నత లక్ష్యంతో కర్నూలులో ఏర్పాటు చేయడంతో పాటు చేశారు. ఓర్వకల్లు దగ్గర విమానాశ్రయం పక్కనే సహజ సిద్ధమైన రాక్ గార్డెన్ సమీపంలో 144.92 ఎకరాలు ఈ వర్సిటీకి కేటాయించారు. ఫేజ్-1 కింద అడామిక్ బ్లాక్, బాలికల హాస్టళ్లు, విశాలమైన రోడ్లు నిర్మాణం కోసం చంద్రబాబు ప్రభుత్వం రూ.18 కోట్లు కేటాయించింది. హైదరాబాదుకు చెందిన యారో కన్‌స్ట్రక్షన్ సంస్థ పనులు చేపట్టింది. అకడమిక్ బ్లాక్ గ్రౌండ్ ఫ్లోర్ 75 శాతం, ఫస్ట్‌ఫ్లోర్ 25 శాతం పనులు చేశారు. బాలిక హాస్టళ్ల పునాది, పిల్లర్ల వరకు నిర్మించి సుమారు రూ.1.76 కోట్లు చేశారు. 2019లో వైసీపీ ప్రభుత్వం రావడంతో వర్సిటీకి శాపంగా మారింది. చంద్రబాబుకు మంచిపేరు వస్తుందనే దురుద్దేశంతో జగన్ ప్రభుత్వం ఐదేళ్లు ఒక్క ఇటుక కూడా పేర్చలేదు. ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పిచ్చి మొక్కలు పెరిగాయి. అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. టీడీపీ ప్రభుత్వం ఆయాంలో 90 శాతం పూర్తి చేసిన చేసిన ఓర్వకల్లు విమానాశ్రయాన్ని మళ్లీ ప్రారంభించి.. ఎయిర్‌పోర్టు తామే నిర్మించినట్లు తమ తండ్రుల విగ్రహాలు పెట్టుకున్న గత వైసీపీ పాలక పెద్దలకు ఆ పక్కనే ముస్లిం విద్యార్థుల భవితను తీర్చిదిద్దే అసంపూర్తి ఉర్దూ యూనివర్సిటీ కనిపించకపోవడం ముస్లిం పట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటితో తెలుస్తుందని విద్యార్థి సంఘాల నాయకులు పేర్కొన్నారు.

రూ.31.26 కోట్లు ఇవ్వండి

2024 ఎన్నికల్లో ఘన విజయం సాధించి సీఎం చంద్రబాబు సారథ్యంలో మళ్లీ టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఉర్దూ ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న ముస్లిం విద్యార్థుల్లో వర్సిటీ నిర్మాణాలపై ఆశలు చిగురించాయి. అసంపూర్తి ఉర్దూ విశ్వవిద్యాలయం పనులు ప్రారంభించి గడువులోగా పూర్తి చేస్తామని కర్నూలు జిల్లాకు చెందిన పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి శాఖ మంత్రి టీజీ భరత్, నంద్యాల జిల్లాకు చెందిన మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్ స్పష్టమైన హామీ ఇచ్చారు. మన ప్రభుత్వం రాగానే సీఎం చంద్రబాబు, విద్యా శాఖ, ఐటీ మంత్రి నారా లోకేశ్ ఉర్దూ వర్సిటీ నిర్మాణాలు చేపడతామని ప్రతిపక్షంలో ఉండగా హామీనిచ్చారు. శాశ్వత భవనాలు పూర్తి చేయడంతో పాటుగా యువతకు ఉపాధి, ఉద్యోగాలు కల్పించే నైపుణ్యాభివృద్ధి శిక్షణ కోర్సులు (స్కిల్ డెవలప్‌మెంట్) ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఆ దిశగా వర్సిటీ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 2025-26 బడ్జెట్‌లో యూనివర్సిటీ ఉద్యోగులు, సిబ్బంది జీతాలకు రూ.4.56 కోట్లు, నిర్వహణ కోసం రూ.1.20 కోట్లతో పాటు శాశ్వత భవనాల నిర్మాణాలకు రూ.25.50 కోట్లు చొప్పున మొత్తం రూ.31.26 కోట్లు నిధులు ఇవ్వాలని వర్సిటీ అధికారులు ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. ఇటీవల ఆర్థిక శాఖ ముఖ్య అధికారులు యూనివర్సిటీల బడ్జెట్‌పై నిర్వహించిన సమీక్షలో కూడా అవసరమైన నిధులపై స్పష్టమైన నివేదిక ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రులు ఎన్‌ఎండీ ఫరూక్, టీజీ భరత్, బీసీ జనార్దన్ రెడ్డి సహా పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితలు సీఎం చంద్రబాబు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌పై ఒత్తిడి తీసుకొచ్చి ఉర్దూ వర్సిటీకి అవసరమైన నిధులు కేటాయించి ఏప్రిల్‌లో పనులు పునఃప్రారంభించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి.

జర్నలిస్టులకు అండగా ఉంటాం

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు పి.తిక్కారెడ్డి
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో సురేంద్రబాబు సంతాపసభ



సురేంద్ర కుటుంబానికి ఆర్థికసాయం చేస్తున్న టీడీపీ నేతలు

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులకు అండగా ఉంటామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు ప్యాలకుర్తి తిక్కారెడ్డి వెల్లడించారు. ఇటీవల మృతి చెందిన ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కెమెరామెన్ సురేంద్రబాబు (చిన్నా) సంతాప సభ కర్నూలు జడ్పీ హాల్‌లో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ముఖ్య అతిథులుగా టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి, కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వై.నాగేశ్వరరావు యాదవ్, టీడీపీ యువనేత కేఈ రుద్రగౌడ్, విద్యాసంస్థల అధినేత డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి, టీడీపీ నేత పెరుగు పురుషోత్తమరెడ్డి తదితరులు హాజరయ్యారు. ముందుగా సురేంద్రబాబు చిత్ర పటానికి తల్లిదండ్రులు జాన్, కామేశ్వరి, భార్య నాగేశ్వరమ్మ, పిల్లలు హరిణి, రాజాదిత్య నివాళులు అర్పించారు.

తిక్కారెడ్డి మాట్లాడుతూ అతి చిన్న వయస్సులోనే సురేంద్రబాబు మృతి కలిచివేసే విషయమన్నారు. ఆయన కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీడీపీ జాతీయ నేత చంద్రబాబు, యువనేత లోకేశ్‌తో చర్చించి, ఎన్టీయార్ ట్రస్టు ద్వారా పిల్లల విద్యాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అలాగే జిల్లాలో టీడీపీ నేతల ద్వారా సేకరించిన డబ్బు డిపాజిట్ చేసి పిల్లల భవిష్యత్తుకు ఉపయోగపడేలా చూస్తామని చెప్పారు. సురేంద్రబాబు భార్య నాగేశ్వరమ్మకు చదువుకు తగ్గ ఉద్యోగాన్ని, నివాసయోగ్యమైన గృహాన్ని ఇప్పిస్తామని చెప్పారు. ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ సురేంద్ర కుటుంబానికి తగిన న్యాయం చేస్తామన్నారు. కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పార్టీ కేంద్ర కార్యాలయం దృష్టికి తీసుకెళ్లి సురేంద్ర కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పారు. టీడీపీ నేత నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ ఒక నిబద్ధత కలిగిన కెమెరామెన్‌ను నేడు కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులోనూ సురేంద్ర బాబు కుటుంబానికి అండగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఐజేయూ సభ్యుడు కె.నాగరాజు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జర్నలిస్టుల కుటుంబ సంక్షేమానికి, భద్రతకు నిధులు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఐజేయూ సభ్యుడు గోరంట్ల కొండప్ప మాట్లాడుతూ సురేంద్ర బాబు తమలో ఒకడని, కుటుంబానికి సహాయ సహకారాలు అందిస్తూ, పిల్లల భవిష్యత్తుకు మంచి బాటలు వేస్తామని అన్నారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఈఎన్ రాజు మాట్లాడుతూ తమతో నిత్యం ప్రయాణం చేస్తూ వచ్చిన సురేంద్ర మృతికి ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నామని, యూనియన్ పక్షాన కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. టీడీపీ నాయకులు తిక్కారెడ్డి, గౌరు చరితారెడ్డి, సోమిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు సురేంద్రబాబు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే రాయలసీమ జర్నలిస్టుల వెల్ఫేర్ అసోసియేషన్ పక్షాన కె. శ్రీనివాసులు, టి.రమేష్, ఎం.భూపాల్ ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి బ్రాంచ్ మేనేజర్ ఆకుల లక్ష్మణ్, ఎడిషన్ ఇన్‌చార్జి చల్లా నవీన్ కుమార్ నాయుడు, డీసీఎం సోమశేఖర్ రెడ్డి, ఏడీవీటి మేనేజర్ గోపాల్, నంద్యాల స్టాఫర్ గోపాల్, ఏబీఎన్ సుంకన్న, యూనియన్ గౌరవాధ్యక్షుడు సుబ్బయ్య, తెలుగు మహిళ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్ బేగం, నాయకులు డి.జేమ్స్, పి.హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

గ్రూప్-2 పరీక్షలపై సమీక్షలో డీఆర్వో వెంకటనారాయణమ్మ



మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-2 పరీక్షలకు సంబంధించి ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించేది లేదని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ స్పష్టం చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ఏపీపీఎస్సీ గ్రూప్స్-2 పరీక్షల నిర్వహణపై సంబంధిత అధికారులతో డీఆర్వో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 23న ఆదివారం జరిగే గ్రూప్-2 పరీక్ష కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించేది లేదన్నారు. అభ్యర్థులు ఉదయం 9:30 గంటల వరకు గ్రేస్ పీరియడ్‌తో కలిసి 9:45 గంటల వరకు అనుమతిస్తామన్నారు. మధ్యాహ్నం సెషన్‌లో 2:30 గంటల నుంచి 15 నిమిషాలు గ్రేస్ పీరియడ్ అంటే 2:45 గంటల వరకు అనుమతి ఉంటుందన్నారు. హాల్ టికెట్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు తీసుకురావాలని అన్నారు.

జిల్లాలో 30 కేంద్రాల్లో 9,993 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. అభ్యర్థుల కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ నెంబర్. 08518-277305ను అందుబాటులో ఉంచామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ కుమార్ రాజు, అసిస్టెంట్ సెక్రటరీ వి.బాబురావు, డీఎస్పీ బాబు ప్రసాద్, సెక్షన్ ఆఫీసర్లు బ్రహ్మేశ్వరరావు, కే.సుధాకర్‌బాబు, ఏఎస్‌వోలు కేఎన్‌ఎస్ అనిల్ కుమార్, టి.ఆంజనయులు, ఏ.యోగేష్ తదితరులు పాల్గొన్నారు.

వలసల నివారణకు చర్యలు తీసుకోవాలి

- జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి
- ముగిసిన జడ్పీ స్థాయి సంఘం సమావేశాలు



మాట్లాడుతున్న జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వలసల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధికారులను ఆదేశించారు. పశ్చిమ ప్రాంతంలో పనులు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని, తక్షణమే కూలీల సంఖ్య పెంచాలని ఆయన అన్నారు. జిల్లా పరిషత్ మినీ సమావేశ భవనంలో గురువారం ఏడు స్థాయి సంఘ సమావేశాలు జరిగాయి. చైర్మన్ అధ్యక్షత వహించగా సీఈఓ జి.నాసరరెడ్డి పర్యవేక్షించారు. వలసల నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. అనంతరం ఉమ్మడి జిల్లా వ్యవసాయ అధికారులపై చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లాలో నకిలీ విత్తనాలను అరికట్టడంతో అధికారులు ఘోరంగా వైఫల్యం చెందారన్నారు. అస్సలు అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో హెచ్చుమీరిన అవినీతిని అరికట్టాలని డిమాండ్ చేశారు. ఆదోని మండలంలో కమ్యూనిటి, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలకు ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. పంటలకు నష్టపరిహారం సకాలంలో ఇచ్చే విధంగా కృషి చేయాన్నారు.

హరికిషన్‌కు జాతీయ పురస్కారం



కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలుకు చెందిన రచయిత, బాలసాహితీవేత్త డాక్టర్ ఎం.హరికిషన్‌కు కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన 'కొనిరెడ్డి ఫౌండేషన్' జాతీయ పురస్కారం గురువారం ప్రకటించారు. హరికిషన్ రాసిన బాలల కథల పుస్తకం 'చిలకముక్కు చిన్నోడు' జాతీయ స్థాయిలో ఉత్తమ తెలుగు బాలల కథల పుస్తకంగా ఎంపికైనట్లు కొనిరెడ్డి ఫౌండేషన్, చదువుల సాహిత్య కళావేదిక సంస్థ ప్రధాన కార్యదర్శి డీకే చదువుల బాబు తెలిపారు. కాలాను గుణంగా యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్ట్రాగ్రాం, టెలిగ్రాం, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల్లోనూ కథలు ప్రసారం చేస్తున్నారు. అలా ఆయన వాట్సాప్ గ్రూపుల ద్వారా 50వేలకు పైగా సబ్‌స్క్రైబర్లతో కథలు, బాలసాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన చిలకముక్కు చిన్నోడు కథల పుస్తకంలో 23 కథలను చిన్నారుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించేలా రాశారు. జాతీయ స్థాయిలో జరిగిన ఈ బాలల కథల పుస్తకాల పోటీకి తెలుగు రాష్ట్రాల నుంచీ అనేక మంది ప్రసిద్ధ రచయితులు పుస్తకాలు పంపించినా, హరికిషన్ పుస్తకం ప్రథమస్థానంలో నిలిచి పురస్కారానికి ఎంపికైంది. మార్చి 8న ప్రొద్దుటూరులో అవార్డుతో పాటు నగదు అందజేసి రచయిత హరికిషన్‌ను సత్కరించనున్నారు.

24న కిసాన్ నిధుల విడుదల

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఈ నెల 24న అర్హులైన రైతులకు పీఎం కిసాన్ సమ్మాన్ పథకం నిధులను విడుదల చేయనుంది. ఈ పథకం ద్వారా ఒక్కో రైతుకు రూ.2వేల చొప్పున ఖాతాల్లో జమ చేస్తారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 4.5 లక్షల మంది రైతులు ఈ పథకం కింద లబ్ధి పొందుతున్నారు. రైతుల బ్యాంకు ఖాతాలకు జమ చేసేందుకు ప్రధాన నరేంద్ర మోదీ బీహార్ రాష్ట్రం బాదల్‌పూర్‌లో జరిగే కార్యక్రమంలో విడుదల చేయనున్నట్లు జేడీఏ వరలక్ష్మి తెలిపారు. ఎవరైనా ఇంకా లబ్ధి పొందకుంటే ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం విడతల వారీగా రైతులకు రూ.6వేలు అందిస్తున్నారు. ఇప్పటి వరకు 18 విడతల ద్వారా రైతుల ఖాతాల్లోకి 2వేలను జమ చేశారు. దేశవ్యాప్తంగా 19వ విడ తలో 9.7 కోట్ల మంది అర్హులకు 2వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు అందనున్నాయి.

హత్యకేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసులు

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మద్దికెర గ్రామానికి చెందిన బీవీఆర్ యూట్యూబర్, న్యూస్ చానల్ విలేఖరి బి.తిరుమల్‌రెడ్డి హత్య కేసులో నిందితులను గురువారం సాయంత్రం అరెస్టు చేశారు. గుంతకల్లు సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐ వెంకటస్వామి తెలిపిన మేరకు.. గుంతకల్లు మండలం సంగాల గ్రామానికి చెందిన జీవన్‌కుమార్‌కు నాలుగు ఎకరాల పొలం ఉండా, పక్కనే ఉన్న ఎకరా ప్రభుత్వ భూమిని ఆక్రమించారు. ఈ విషయంపై తిరుమల్ రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పిర్యాదు చేయడమే కాకుండా డబ్బులు డిమాండ్ చేశాడు. దీంతో జీవన్ కుమార్ తిరుమల్ రెడ్డిపై కక్ష పెంచకుని బోయ రామాంజనేయులు, బోయ రామన్న సాయంతో ఈ నెల 17న గుంతకల్లు నుంచి హతుడు బుగ్గ సమీపాన గల తన తోటకు బైక్‌పై వెళుతుండగా ట్రాక్టరుతో గుద్ది కాలువలో పడేసి హత్య చేశారు. 18న మృతదేహం బయట పడింది. పోలీసులు విచారణ చేసి, నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సీఐ, ఎస్‌ఐలతో పాటు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్, కానిస్టేబుళ్లు జాఫర్, కిషోర్ కుమార్, రాఘవేంద్ర, నాగేశ్వరరావు, అంజి, నూర్ అహ్మద్‌ను డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు. నిందితుడు, హత్యకు ఉపయోగించిన ట్రాక్టర్, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధం



దగ్ధమైన గుడిసె

ఆస్పరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలేకల్ గ్రామంలో బోయ ఉచ్చరప్పకు చెందిన గుడిసె బుధవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. బాధితుడి కథనం మేరకు.. విద్యుత్ తీగలు షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం చోటు చేసుకుని రూ.5లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. తిండి గింజలు, బంగారు, తదితరాలు దగ్ధమయ్యాయి. బాధితుడిని ఆదుకోవాలని గ్రామస్తులు వెంకటేష్, మహేష్, వీరేష్ కోరారు.

రైలు నుంచి జారిపడి వృద్ధుడి మృతి

కోసిగి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కోసిగి రైల్వేస్టేషన్ పరిధిలో గురువారం సాయంత్రం రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. వివరాల మేరకు.. వృద్ధుడు జారిపడినట్లు గమనించిన వారు ఎస్ఐ చంద్రమోహన్‌కు ఇచ్చిన సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి ఏఎస్ఐ నాగరాజు, కానిస్టేబుళ్లు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆదోని రైల్వే అధికారులకు సమాచారం అందించారు. ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని మృతదేహంగా నమోదు చేశారు. ఆదోని రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

ఈ-శ్రమ్‌తో కార్మికులకు భద్రత

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఈ-శ్రమ్ కార్డు ద్వారా అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా లభిస్తుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఉదయం ఈ-శ్రమ్ రిజిస్ట్రేషన్ అంశంపై కార్మిక, ఇతర శాఖలు, అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. అసంఘటిత రంగ కార్మికులకు ఈ-శ్రమ్ కార్డు అవసరమైన సమయాల్లో ఆసరాగా నిలుస్తుందన్నారు. జిల్లాలోని అసంఘటిత రంగ కార్మికుల నమోదుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్మిక శాఖ డీసీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏటవాలు దుక్కితో భూమి సారవంతం

సి.బెళగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏటవాలు దుక్కితో భూమి సారవంతంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ అన్నారు. గురువారం మండల వ్యవసాయ కార్యాలయంలో రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాలలో పనిచేస్తున్న ఎంపీఈవోలు రైతులకు అందుబాటులో ఉండా లన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి

సి.బెళగల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ శ్రీనివాసులు సర్పంచ్‌లకు ఆదేశించారు. గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అనుమతి లేని కొళాయిలను రద్దు చేయాలన్నారు.

బకాయిలు విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న రూ.3,500 కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయా లని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ, జిల్లా ఉపాధ్యక్షుడు రమణ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లికి వందనం పథకాన్ని వెంటనే అమలు చేసి ప్రతి విద్యార్థికి రూ.15వేలు జమ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండున్నర లక్షల ఉద్యోగాలతో పాటు 50వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలన్నారు. హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యు నాయకులు దామోదర్, రాజు, మద్దూరు సూర్య, సాయి పాల్గొన్నారు.

స్పాట్ డ్యూటీల నుంచి మినహాయించాలి: ఆప్టా

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశా లలో పనిచేస్తున్న ఎస్టీటీలను ఇన్విజిలేటర్, స్పాట్ డ్యూటీలను మినహా యించాలని ఆప్టా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.గణపతిరావు, ప్రధాన కార్యదర్శి ఆకే ప్రకాష్‌రావు ప్రభుత్వాన్ని గురువారం ఒక ప్రకటనలో కోరారు. ప్రాథమిక పాఠశాలలో ఒకరు లేక ఇద్దరు ఎస్టీటీ టీచర్లు పని చేస్తున్నా రన్నారు. వీరికి మార్చి, ఏప్రిల్ నెలలో జరిగే ఇంటర్ పరీక్షల ఇన్విజిలేటర్ల డ్యూటీలు, పదో తరగతి పరీక్షల ఇన్విజిలేటర్లు, స్పాట్ వాల్యుయేషన్ విధులు కేటాయిస్తున్నారన్నారు. ప్రాథమిక పాఠశాలలు, ఏకోపాధ్యాయ పాఠశాలలు అవుతున్నాయన్నారు. దీంతో ఆయా ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. రాబోవు రోజుల్లో ఎస్టీటీ ఉపాధ్యాయులను పది పరీక్షల విధులకు ఉపయోగించడం వల్ల ఆయా ప్రాథమిక పాఠశాలలో విద్యాబోధనకు ఆటంకం కలుగుతుందన్నారు. ఈ డ్యూటీల నుంచి ఎస్టీటీలను మినహాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూల్ అసిస్టెంట్లను పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు ఇన్విజిలేటర్లుగా నియమించాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. పది పబ్లిక్ పరీక్షల కోసం 3450 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసిందని, ప్రతి 20 మందికి ఒక ఇన్వి జిలేటర్ ఉండాలని, అదనంగా అవసరం ఉంటేనే ఎస్టీటీలను నియ మించుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులో పేర్కొందన్నారు. అవసరమైతే ఉపయోగిస్తామన్న ప్రభుత్వ నిర్ణయాన్ని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసి యేషన్ స్వాగతిస్తోందన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

గూడూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని జులకల్ మోడల్ స్కూల్‌లో క్షయ వ్యాధి నివారణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థు లకు అవగాహన కల్పించారు. క్షయ వ్యాధితో ప్రతి సంవత్సరం అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఈ వ్యాధి మైక్రో బ్యాక్టీరియం ట్యూబరక్యూలో ఫిల్స్ అనే బ్యాక్టీరియాలతో వస్తుందని వివరించారు. ఈ వ్యాధి ఊపిరి తిత్తులతోపాటు మెదడు, మూత్రపిండాలు, వెన్నముకలపై ప్రభావం చూపిస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దిల్షాద్, జిల్లా టీబీ సమన్వయకర్త రామకృష్ణ, పర్యవేక్షకుడు మహేంద్ర, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న తహసీల్దార్, అధికారులు

గూడూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రీసర్వే కార్యక్రమాన్ని పకడ్బం దీగా నిర్వహించాలని గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో అడిషినల్ సీసీ ఎల్, డైరెక్టర్ సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, మండల అధికారులకు సూచించారు. సర్వేను రైతుల సహకారంతో పకడ్బందీగా చేపట్టాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తహసీల్దార్ రామాంజనేయులు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ లోకేశ్వరరెడ్డి, సర్వేయర్ బాలునాయక్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో యువతకు ఉపాధి కల్పించాలి


మాట్లాడుతున్న శ్రీరాములు

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల్లో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి బీసన్న కోరారు. గురువారం ఓర్వకల్లులోని బుగ్గ రామేశ్వర డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర మహాసభలు ఘనంగా జరిగాయని, ఆ మహా సభల్లో రాష్ట్ర సమగ్రాభివృద్ధికి 31 అంశాలతో తీర్మాణాలు చేసి వాటి అమలుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఉద్యమ కార్యాచరణ ప్రకటించామన్నారు. ప్రతి ఏటా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని చెప్పి ఇంతవరకు దానిపై ఎటువంటి ప్రకటన చేయలేదన్నారు. ఓర్వకల్లు ఇండస్ట్రీయల్ హబ్ అనేది పేరుకు మాత్రమే అని, ఎక్కడా కూడా పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేద న్నారు. పొలాలు తీసుకుని రైతుల కుటుంబానికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని యజమాన్యాలు చెప్పినప్పటికీ ఎక్కడా కూడా అమలు కావ డం లేదన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి బాబు, శివ, పవ న్, అనిల్ పాల్గొన్నారు.

కర్నూలు న్యూసిటీ: జిల్లాలో యువతకు ఉపాధి చూపించే పరిశ్రమలు ఎక్కడ ఉన్నాయని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు ప్రశ్నించారు. గురువారం స్థానిక సీఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపన లేకపోవడం తో నిరుద్యోగ యువత బెంగళూరు, హైదరాబాద్, ముంబై, కేరళ లాంటి రాష్ట్రాలకు వలస పోతున్నారన్నారు. ఈ సమావేశంలో నగర కార్యదర్శి బీసన్న, నాయకులు షాబీర్ బాషా, సోమన్న, చంటి, అఖిల్ పాల్గొన్నారు.

వాము ధర పైపైకి..

- క్వింటా రూ.26వేలు
- ఇంకా పెరిగే అవకాశం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మార్కెట్ యార్డులో వాము ధర రోజురోజుకు పెరుగుతూనే ఉండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గురువారం కర్ణాటక, తెలంగాణ, తదితర పక్క రాష్ట్రాల నుంచి కూడా పెద్ద ఎత్తున అమ్మకానికి రైతులు వామును తీసుకువచ్చారు. గరిష్ఠ ధర రూ.26వేలు, మధ్యస్థ ధర రూ.11,499 కనిష్ఠ ధర రూ.1,262 పలికిందని సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. అదేవిధంగా వారం రోజుల క్రితం రూ.6వేలకు పడిపోయిన వేరుశనగ కాయల ధర గురువారం ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కంటే ఎక్కువే పలికింది. గరిష్ఠ ధర రూ.6,906, మధ్యస్థ ధర రూ.5,709లు, కనిష్ఠ ధర రూ.4,701 పలికింది. ఆముదాలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు ఏకంగా రూ.5,769లకు అమ్ముడుపోవడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గత ఏడాది బస్తా వాము పొట్టు కేవలం రూ.100లకు కూడా అమ్ముడుపోని పరిస్థితి ఎదురైంది. గురువారం గరిష్ఠ ధర రూ.4,622 మధ్యస్థ ధర రూ.2,173, కనిష్ఠ రూ.2,089 పలికింది. కందులు గరిష్ఠ ధర రూ.7.663, మధ్యస్థ ధర రూ.7,348, కనిష్ఠ ధర రూ.2,169లు దక్కింది. శనగలకు గరిష్ఠ, మధ్యస్థ ధరలు 5,819, కనిష్ఠ ధర రూ.2,009 పలికినట్లు సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ జయలక్ష్మి, అసిస్టెంట్ సెక్రటరీ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉల్లిగడ్డల గరిష్ఠ ధర రూ.2,600, మధ్యస్థ ధర రూ.1,670, కనిష్ఠ ధర రూ.659లకు అమ్ముడుపోయింది. ఎండుమిరప కాయలకు గరి ష్ఠ ధర రూ.13,001లు, మధ్యస్థ ధర రూ.9,569లు, కనిష్ఠ ధర రూ.4,169 లు పలికింది.


రైతులు అమ్మకానికి తెచ్చిన వాము

సర్వీస్ ప్రొవైడర్లు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిక్షణను సర్వీస్ ప్రొవైడర్లు సద్వినియోగం చేసుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ నాగశివలీల అన్నారు. మెప్మా, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నగర పాలక సంస్థ పరిధిలోని సర్వీస్ ప్రొవైడర్లకు గురువా రం నరసింహరెడ్డి నగర్‌లోని విజన్ కాలేజీలో బ్యూటీషియన్‌పై ఒక్కరోజు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసి సర్టిఫికేషన్ పొందిన వారు హోమ్ ట్రయాంగిల్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అన్‌బోర్డు చేసి జీవనోపాధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మెప్మా సిటీ మిషన్ మేనేజర్ విజయభాస్కర్‌రెడ్డి, యూత్ అప్ టర్న్ వలంటరీ అసోసియేషన్ సభ్యులు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ


సచివాలయంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కమిషనర్

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్ప నగర్‌లో 89వ సచివాలయాన్ని నగర పాలక కమిషనర్ రవీంద్రబాబు గురువారం తనిఖీ చేశారు. అనంతరం పరిమళ నగర్ వద్ద ఉన్న అన్నక్యాంటీన్‌లో అల్పాహారాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆయన బండిమెట్ట, ఛత్రీబాగ్, పెద్దపడఖాన ప్రాం తాలలో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు.

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేసి కేరళ ప్రభుత్వం తరహాలో ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఆవాజ్ కమిటీ నగర అధ్యక్షుడు పి.ఇక్బాల్ హుసేన్ డిమాండ్ చేశారు. గురువారం కమిటీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావే శంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం లోకి వచ్చాక మతోన్మాద అజెండాను అమలు చేస్తుందన్నారు. పార్లమెం టులో ఈ బిల్లు వస్తే టీడీపీ కూటమి ప్రభుత్వంతోపాటు వైసీపీ ఎంపీలు వ్యతిరేకించాలని అన్నారు. ఈసమావేశంలో కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, చాంద్‌బాషా, మహ్మద్ పాల్గొన్నారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సీఐటీ యూ పాతబస్తీ కార్యదర్శి దూదెకొండ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా పరిషత్ ఆవరణలోని ఏపీజీబీ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ ప్రధాన కార్యాల యం కడపలోనే ఉండడానికి అన్ని రకాల అర్హతలు ఉన్నాయన్నారు. ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రామక్రిష్ణ, సామేలు, కార్మికులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. గురువారం ఐలమ్మ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025-26 సంవత్సరానికి వార్షిక బడ్జెట్‌లో రజకుల సంక్షేమానికి నిధులు కేటాయించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సామాజిక దాడులు, దౌర్జన్యాలు, అక్రమ కేసుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక చట్టం ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి శ్రీనివాసులు, సి.శేషాద్రి, సి.రాముడు, జయమ్మ, పర్ల సుంకన్న పాల్గొన్నారు.

23న మెడికల్ క్యాంపు

కర్నూలు న్యూసిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): స్థానిక ఇందిరాగాంధీ నగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఈనెల 23న రెగ్యులర్ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు సుందరయ్య స్ఫూర్తి కేంద్రం జీబీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ ప్రసాద్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులో బీపీ, షుగర్, పక్షవాతం, పిట్స్ తదితర వ్యాధులకు వైద్యులు సూచించే మందులు తక్కువ ధరకే ఇస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉచిత న్యాయ సేవలను వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న లీలా వెంకట శేషాద్రి

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉచిత న్యాయ సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలని డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ సీనియర్ సివిల్ న్యాయాధికారి బి.లీలా వెంకట శేషాద్రి అన్నారు. గురువారం ప్రభుత్వ డిగ్రీ బాలుర కళాశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సామాజిక దినోత్సవాన్ని రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. న్యాయ చట్టాలను పాటిస్తామని విద్యార్థులతో ప్రమాణం చేయించారు. అనంతరం బి. లీలా వెంకట శేషాద్రి, ప్రిన్సిపాల్ ఇందిరా శాంతి, రోటరీ క్లబ్ సభ్యుడె రాయపాటి శ్రీనివాసులు మాట్లాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హేమంత్, ఎ.సత్యనారాయణ, అధ్యాపకులు రోషన్న, నాగరత్న, మురళీధర్, ధర్మేందర్, శశికళ, డి.వెంకటస్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకోవాలి'

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన అవినీతి, అక్రమా లపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ వర్సిటీ కన్వీనరు రామక్రిష్ణ డిమాండ్ చేశారు. గురువారం యూనివర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కళాశాలలో గతంలో రూ. 2కోట్లపైన అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఈ సమావేశంలో నాయకులు మౌలాలి, సాగర్, రాజేష్, గణేష్, ఆశోక్, ప్రదీప్, ప్రకాష్, నాగరాజు పాల్గొన్నారు.

మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తాం

డీఎఫ్‌సీఎస్ చైర్మన్ నవీన్ కుమార్


వినతి పత్రం ఇస్తున్న మత్స్యకార్మికులు

కర్నూలు అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కర్నూలు జిల్లాలో మత్స్య సహకార సంఘాలను బలోపేతం చేస్తామని డీఎఫ్‌సీఎస్ చైర్మన్ నవీన్ కుమార్ స్పష్టం చేశారు. ప్రతి మత్స్యకార్మికుడు సహకార సంఘాల్లో సభ్యుడుగా చేర్పేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గురువారం కర్నూలు నగరంలోని బంగారుపేటలో ఉన్న జిల్లా మత్స్యకార సహకార సంఘం కార్యాలయంలో ఎమ్మిగనూరు మండలం పార్లపల్లి గ్రామానికి చెందిన మత్స్యకారులు చైర్మన్‌ను కలిశారు. ఇప్పటిదాకా తమ గ్రామంలో మత్స్యకారుల కోసం సంఘాన్ని ఏర్పాటు చేసేందుకు ఎవరూ కృషి చేయలేదని, మీరైనా సహకార సంఘాన్ని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. త్వరలోనే పార్లపల్లి మత్స్యకార సహకార సంఘాన్ని ఏర్పాటు చేస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం గౌరవా సలహాదారులు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు

ఎంఎస్ఎంఈ సర్వేకు సహకరించండి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎంఎస్ ఎంఈ సర్వే వచ్చే నెల 15 వరకు జరుగుతుందని, ఈ సర్వే ద్వారా వ్యాపారులకు సంబంధించిన ప్రతి షాపు, పరిశ్రమ నుంచి పూర్తి స్థాయిలో వివరాలను ప్రత్యేక యాప్ ద్వారా నమోదు చేస్తామని వ్యాపారులు, పరిశ్రమల యజమానులు, ఈ సర్వేకు సహకరించాలని కలెక్టర్ రంజిత్ బాషా గురువారం విజ్ఞప్తి చేశారు. ఎంఎస్ఎంఈ సర్వే ద్వారా పరిశ్రమలకు ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ సర్వే అనంతరం ఉద్యమ్ గుర్తింపు సంఖ్య జారీ చేస్తామని, బ్యాంకు నుంచి రుణాలు మంజూరు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని, మార్కెటింగ్, ఈ-కామర్స్ ద్వారా వ్యాపారాలు విస్తరించుకునే వీలు ఉంటుందని, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే టెండర్లలో ప్రాధాన్యత ఇస్తామని కలెక్టర్ వివరించారు.

నేడు న్యాయవాదుల విధుల బహిష్కరణ

కర్నూలు లీగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): న్యాయవాదుల చట్టంలో కేంద్ర ప్రభుత్వం తీసుకురానున్న సవరణలకు వ్యతిరేకంగా శుక్రవారం న్యాయవాదులు తమ కోర్టు విధులను బహిష్కరించడా నికి నిర్ణయించి నట్లు కర్నూలు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి బీఎస్ రవికాంత్ ప్రసాద్‌లో గురు వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సవరణల ద్వారా ప్రవేశ పెట్టనున్న సెక్షన్ 35ఏ న్యాయవాదుల హక్కులకు భంగం కలిగిం చేలా ఉందని వెంటనే ఈ సెక్షన్‌ను తొలగించాలని బార్ అసోసియేషన్ తీర్మాణించినట్లు వారు తెలిపారు.

బీసీల జనగణన చేపట్టాలి


మాట్లాడుతున్న వై.నాగేశ్వరరావు యాదవ్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీలో బీసీ కులాల జనగణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై.నాగేశ్వరరావు యాదవ్ పేర్కొన్నారు. గురువారం స్థానిక బీసీ భవన్‌లో ఏపీ బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో సంఘం ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వై.నాగేశ్వరరావు యాదవ్ మాట్లాడుతూ బీసీ జనాభా నిష్పత్తి ప్రకారం కులజనాభా ఎంతో వారికి ఉద్యోగ, విద్య, ఉపాధి రాజకీయ రంగాల్లో వాటాలు కల్పించాలన్నారు. రాష్ట్రంలో బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలన్నారు. బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో ఏబీసీడీ వర్గీకరణ చేసిన విధంగానే రాజకీయ రంగాల్లో కూడా ఏబీసీడీ వర్గీకరణ చేపట్టి ఎంబీసీ కులాలకు న్యాయం చేయాల న్నారు. లబ్ధిదారుడికి రుణాలు కేటాయించే విషయంలో బ్యాంకులకు సంబంధం లేకుండా వివిధ బీసీ కుల కార్పొరేషన్ల ద్వారానే నేరుగా రుణాలు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి వెంపెంట రాంబాబు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆనందబాబు, బీసీ నాయకులు వాడాల నాగరాజు, యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు అయ్యన్న, కుమ్మరి సంఘం జిల్లా అధ్యక్షులు సోమేష్, కార్యదర్శి బజారి పాల్గొన్నారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


బహుమతి అందజేస్తున్న దాతలు

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో ఎడ్ల బండలాగు పోటీలు గురువారం హోరాహోరీగా జరిగాయి. రామిరెడ్డితాత తిరుణాల, పోచమ్మ, కర్రెమ్మ జాతరను పురస్కరించుకుని నిర్వహించిన పోటీలకు వివిధ ప్రాంతాల నుంచి సుమారు 17 ఎద్దుల జతలు పాల్గొన్నాయి. పాణ్యం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన బీరం సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి ఎద్దులు 3305 అడుగుల దూరం లాగి ప్రథమ విజేతగా నిలిచాయి. విజేతకు టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి రూ. 30 వేలు నగదు బహుమతి అందించారు. రెండో విజేత తాండ్రపాడు చిన్నరత్నంకు కోట్ల హరిచక్రపాణిరెడ్డి రూ.22వేలు అందించారు. మొత్తం 11 స్థానాలకు దాతలు నగదు బహుమతులను ప్రకటించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, బంకు గిడ్డయ్య, తిక్కరామయ్య పాల్గొన్నారు.

ఎన్జీవో జిల్లా కార్యదర్శి జవహర్‌లాల్ సస్పెన్షన్


మాట్లాడుతున్న వెంగల్ రెడ్డి

కర్నూలు కలెక్టరేట్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎన్జీవో జిల్లా కార్యదర్శి జవహర్ లాల్ సస్పెండ్ చేస్తూ జిల్లా ఎన్జీవో ఎగ్జిక్యూటీవ్ తీర్మాన ం చేశారు. గురువారం జిల్లా ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. జిల్లా ఎన్జీవో కార్యక్రమాలకు వ్యతిరేకంగా పాల్పడుతున్నందున జిల్లా ఆఫీస్ బేరర్స్ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివారెడ్డి, రమణ, జిల్లా కోశాధికారి భాస్కర నాయుడు సస్పెన్షన్‌ను జిల్లా కార్యవర్గం ఆమోదం తెలిపింది. తాత్కాలిక జిల్లా కార్యదర్శిగా కేసీహెచ్ కృష్ణుడిని ఎన్నుకున్నారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు వెంగల్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల మాజీ ముఖ్యమంత్రి జగన్మో హన్ రెడ్డి పోలీసు అధికారులపై అసభ్యపదజాలంతో బట్టలూడదిస్తాము అని దౌర్జన్యకరంగా మాట్లాడినందుకు జిల్లా సంఘం పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం అసోసియేషన్ అధ్యక్షులు వి.దస్తగిరిరెడ్డి, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎంసీ కాశన్న, ఎం.రామకృష్ణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, రవిప్రకాష్, మధు, నాగరాజు, కే.సీహెచ్ కృష్ణుడు, పద్మావతి, అన్ని తాలుకాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటు సారాను పూర్తిగా నిర్మూలిద్దాం

కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): నాటు సారాను పూర్తిగా నిర్మూలించేందుకు తయారీ దారులు సహకరించాలని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని బంగారుపేటలో నవోదయం 2.0 భాగంగా ర్యాలీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాటు సారాను పూర్తిగా నిర్మూలించేందుకు బంగారుపేట వాసులు సహకరించాలని కోరారు. అసిస్టెంట్ సూపరింటెండెంట్ రాజశేఖరగౌడ్, సీఐలు చంద్రహసన్, జయరామ్ నాయుడు, సుబాషిని, ఎస్ఐ రెహనాబేగం పాల్గొన్నారు.

కోడుమూరు: రాష్ట్రంలో సారా రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ మంజుల అన్నారు. స్థానిక ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గురువారం ఆమె మాట్లాడుతూ సారా నిర్మూలన కోసం నవోదయం అనే కార్యక్రమాన్ని చేపట్టనున్నామన్నారు. ఎక్సైజ్ డీసీ శ్రీదేవి, ఏసీ మనుమంతరావు, ఈఎస్ సుధీర్ ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని నాటు సారా తయారీ, అమ్మకపు స్థావరాలను గుర్తించి దాడులు చేసి కేసులు నమోదు చేస్తామన్నారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ ప్రజల చేత గ్రామ, మండల స్థాయి కమిటీ ఏర్పాటు చేయించి కమిటీ సహ కారంతో ప్రజల్లో చైతన్య తీసుకువస్తామని చెప్పా రు. నాటుసారా తాగడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యలు, నష్టాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని తెలిపారు. నాటుసారా తయారీ, అమ్మకా లపై 9440902575 నంబర్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఎక్సైజ్ ఎస్ఐలు చంద్రమోహన్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి ఉదారత

కోడుమూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనుగొండలో టీడీపీ నాయకుడు రామక్రిష్ణారెడ్డి ఉదారతను చాటుకు న్నారు. సుమారు 50 మంది డ్రమ్స్ కళాకారులకు టీషర్టులు, షార్టులు అందించారు. గురువారం ఎస్ఐ శ్రీనివాసులు, ఎంపీడీవో రాముడు చేతులమీదుగా ఆయన పంపిణీని చేపట్టారు. విష్ణుసేన పేరున సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు రామక్రిష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సర్వేశ్వరరెడ్డి, మధురెడ్డి, హనుమంతు, జగ్గయ్య, సాయిపతి, పరమేష్ పాల్గొన్నారు.

నేడు అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం

కర్నూలు కల్చరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు నగరం లోని తెలుగు కళా సమితి ఆధ్వర్యంలో కొండారెడ్డి బురుజు సమీపంలోని తెలుగు తల్లి విగ్రహం వద్ద నివాళి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ కార్యదర్శి మధురకవి ఎలమర్తి రమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషాభిమానులంతా హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని ఘంటసాల గానకళా సమితి ఆధ్వ ర్యంలో తెలుగు తల్లి విగ్రహం వద్ద అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ కార్యదర్శి సుస్వరం వాసుదేవ మూర్తి తెలిపారు. శుక్ర వారం ఉదయం 8.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు తల్లి విగ్రహానికి పూలదండలతో అలంకరణ, నివాళి అర్పించే కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు.

● **టీజీవీ కళాక్షేత్రంలో కవులకు సత్కారం:** అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవా రం సాయంత్రం 6.30 గంటలకు తెలుగు తల్లి చిత్రపటానికి నివాళి కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు కళాక్షేత్రం అధ్యక్షులు విద్వాన్ పత్తి ఓబులయ్య తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాకు చెందిన నలుగురు ప్రముఖ కవులు, రచయితలకు సత్కార కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

బీజేపీ సంబరాలు

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుధవార పేటలోని బీజేపీ కార్యాలయంలో గురువారం ఢిల్లీ ముఖ్యమంత్రిగా రేఖా గుప్త పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా బీజేపీ ఆధ్వర్యంలో సంబరాలను నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి మాతృవియోగం

పరామర్శించిన గౌరు వెంకటరెడ్డి


చంద్ర లక్ష్మీదేవి మృతదేహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకుడు గౌరు వెంకటరెడ్డి

ఓర్వకల్లు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని హుశేనాపురం గ్రామ టీడీపీ నాయకుడు కాల్వబుగ్గ మాజీ చైర్మన్ చంద్రపెద్ద స్వామి తల్లి చంద్ర లక్ష్మీదేవి (68) గురువారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న టీడీపీ సీనియర్ నాయకుడు నందికొట్కూరు టీడీపీ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ లక్ష్మీదేవి భౌతికకాయానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహానికి సర్పంచ్ చంద్ర గోవర్ధనమ్మ, ఎంపీటీసీ చిన్నమ్మ, మాజీ ఎంపీపీ లక్ష్మణరావు, కాల్వబుగ్గ మాజీ చైర్మన్ జీకే సుధాకర్, మాజీ సర్పంచ్ మల్లెల జ్యోతి, గ్రామ నాయకులు కేవీ మధు, మహబూబ్ బాషా, బజారు, నాగరాజు, గ్రామ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు భౌతికకాయానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దుతాం: కలెక్టర్

కర్నూలు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వర్చువల్ స్టూడియోను సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. గురువారం ఎస్‌బీఐ కాలనీలో ఏర్పాటు చేసిన వర్చుల్ స్టూడియోను కలెక్టర్‌తోపాటు డీఈవో శ్యామ్యూల్ పాల్ సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వర్చువల్ స్టూడియోను వేసవిలో కంప్యూటర్ శిక్షణకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే కంప్యూటర్‌లో పరిజ్ఞానం అందించే లక్ష్యంగా ఈ కేంద్రం పని చేస్తుందన్నారు. ఇందులో కోర్సు చేసిన వారికి స్కిల్ డెవలప్మెంట్ సంస్థ సర్టిఫికెట్లు అందిస్తుందన్నారు. ప్రాథమిక స్థాయి నుంచి ఉన్నత విద్య వరకు విద్యార్థులకు వేసవి సెలవులు వినియోగించుకునేలా కోర్సులకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వేసవిలో నిర్వహించాల్సిన తరగతులను కోర్సులను వాటి కాలపరిమితి అంశాలను పొందుపరచాలన్నారు. వీటికి సంబంధించిన ప్రణాళికను సిద్ధం చేయాలని డీఈవోను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట మున్సిపల్ ఎస్ఈ రాజశేఖర్, విద్యాశాఖ అధికారులు ఉన్నారు.

జాతరకు ఆహ్వానం



ఆహ్వానం పలుకుతున్న ఆలయ నిర్వాహకులు

ఆలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గూళ్యం గ్రామంలో మార్చి 4న నిర్వహించనున్న గాదిలింగప్ప జాతరకు గురువారం పోస్టర్లను విడుదల చేశారు. టీడీపీ కార్యాలయంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్‌ను నిర్వాహకులు ఆహ్వానించారు. పూజారి మల్లన్న, గాదిలింగప్పా, సిద్ద లింగప్ప, మల్లప్ప పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం



ఎస్‌ఐని సన్మానిస్తున్న సీఐ, నాయకులు

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమని విధి నిర్వహణలో బాధ్యతతో పనిచేస్తే ప్రజలు ఆదరిస్తారని సీఐ జయన్న అన్నారు. గురువారం బదిలీపై వెళుతున్న ఎస్‌ఐ గోపాల్‌ను సన్మానించారు. టీడీపీ నాయకులు బత్తిన లోక్‌నాథ్, సోమ్లా నాయక్, హరినాథ్‌గౌడ్, బీటీ గోవిందు, వైసీపీ నాయకుడు నాగరాజు, సీపీఐ నాయకుడు వీరన్న, కాంగ్రెస్ నాయకుడు క్రాంతి నాయుడు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి



కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని బీజేపీ అధికార ప్రతినిధి ఆదూరి విజయకృష్ణ కోరారు. గురువారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ కృష్ణకు వినతి పత్రం ఇచ్చారు. ఇదివరకు ఏర్పాటుచేసిన 60 సీసీ కెమెరాలలో కేవలం 5 మాత్రమే పనిచేస్తున్నాయనానరు. 55 కెమెరాలు పనిచేయని కారణంగా నేరాల అదుపుకు పోలీసులు ఇబ్బంది పడుతునానని, పనిచేయని వాటికి మరమ్మతులు చేయించాలని కోరారు. స్పందించిన కమిషనర్ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రమాకాంత్, శ్రీనివాస్ ఆచారి, వాల్మీకి సాయి ప్రసాద్, వీరేష్, జాఫర్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సీపీఎం కార్యదర్శి వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు దస్తగిరి డిమాండ్ చేశారు. గురువారం ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఖాన్, ఏఈ విష్ణువర్ధన్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. కలెక్టర్ పత్తికొండకు వచ్చిన సందర్భంలో తాగునీటి సమస్యపై వినతి పత్రం అందించామని, కలెక్టర్ కూడా స్పందించారన్నారు. సమస్య పరిష్కారానికి రూ.689 కోట్లు అవసరమని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు.

సౌకర్యాల కల్పనలో విఫలం

ఆదోని టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం పాద యాత్రికులకు సౌకర్యాలను కల్పించడంలో ఆలయ అధికారులు విఫలమయ్యారని బీజేపీ కో కన్వీనర్ నాగరాజు గౌడ్ విమర్శించారు. గురువారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ, రూ.కోట్ల ఆదాయం వస్తున్నా, తాగునీటి వసతి కల్పించలేదన్నారు. పార్టీ ఉత్తర మండల అధ్యక్షుడు మహదేవ్, పెద్ద తుంబలం మండల అధ్యక్షుడు వేణుగోపాల్, సాదాపురం మండల అధ్యక్షుడు ఉషారాజ్, వడ్డే రాము, కిరణ్, రమేష్ ఆచారి, బసాపురం నాగరాజు, రామకృష్ణ పాల్గొన్నారు.

యూనిట్లు 50, దరఖాస్తులు 677

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ కార్పొరేషన్ల రుణాలకు మండలానికి 50 యూనిట్లకు గాను 677 దరఖాస్తులు వచ్చాయి. దీంతో ఎవరికి అవాకాశం వస్తుందోనన్న సందేహం కలుగుతోంది. మండలంలో 8 పంచాయతీలు ఉండగా, రెండు బ్యాంకులు ఉన్నాయి. పెరవలి ఆంధ్రప్రగతి బ్యాంకు పరిధిలో పెరవలి, బసినేపల్లి, హంపా, ఎడవలి, బొమ్మనపల్లి గ్రామాలు పంచాయితీలోకి వస్తాయి. మద్దికెర కెనరా బ్యాంకు పరిధిలో మద్దికెర, ఎం.అగ్రహారం, బురుజుల గ్రామాలు ఉన్నాయి. . పెరవలి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకుకు బీసీ-ఏ 9, బీసీ-బి-6, బీసీ-డీ-2, బీసీ-ఈ-4.. 20 యూనిట్లకు గాను 373 మంది దరఖాస్తు చేసుకున్నారు. మద్దికెర కెనరా బ్యాంకు పరిధిలో బీసీ-ఏ-12, బీసీ-బీ-7, బీసీ-డి-4, బీసీ-ఈ-6 మొత్తం 29 యూనిట్లకు 304 మంది దరఖాస్తులు చేసుకున్నారు. అభ్యర్థులకు ఎంపీడీవో కార్యాలయంలో నేటి నుంచి ఇంటర్వ్యూలు జరగనున్నాయి. 21న పెరవలి, మద్దికెర, 22న హంపా, బురుజుల గ్రామాల వారికి ఇంటర్వ్యూలు ఉంటాయని ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 10.30 గంటలకు దరఖాస్తు, సర్టిఫికెట్లతో హాజరుకావాలని ఎంపీడీవో కొండయ్య సూచించారు.

ఉపాధి కల్పించడమే టీడీపీ ధ్యేయం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్



నియామక పత్రాలు అందజేస్తున్న పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు

ఆలూరు జాబ్‌మేళాలో 200మందికి ఉద్యోగాలు
ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే రామాంజనేయులు

ఆలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే టీడీపీ ప్రభుత్వ ధ్యేయమని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం పట్టణంలోని ఇబ్రహీం కళ్యాణ మండపంలో జాబ్‌మేళా నిర్వాహకుడు దుర్గ ప్రసాద్ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఆలూరు ప్రాంతంలో ఉపాధిలేక చదువుకున్న వారు వలస వెళ్తున్నారన్నారు. ఈ జాబ్ మేళాలో 200 మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు వచ్చాయని తెలిపారు. ఎమ్మెల్యే రామంజినేయులు మాట్లాడుతూ ఆలూరు పత్తిపాడు నియోజక వర్గాలు తనకు సమానమని, జూన్‌లో మరో మారు జాబ్‌మేళా జరిగేలా చూస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మారెప్ప, కురువ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, మార్కెట్ మాజీ ఛైర్మన్ రామనాథ్ యాదవ్, డీసీసీ అధ్యక్షుడు మిక్కిలినేని ప్రసాద్, ఏబీసీ కాల్వ ఛైర్మెన్ కిష్టప్ప, టీడీపీ నాయకులు రఘు ప్రసాద్ రెడ్డి, గిరి మల్లేష్ గౌడ్, కామినేహల్ రమేష్, అట్టేకల్ జగన్మోహన్ బాబు, రాంనాథ్ యాదవ్ పాల్గొన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

ఆస్పరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు గురువారం ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో గీతావాణి గురువారం తెలిపారు. 22న ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో కైరుప్పల ఏపీజీబీ బ్యాంకుకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఉంటాయిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు సర్టిఫికెట్లను తీసుకురావాలని కోరారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

హాలహర్వి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గూళ్యం గ్రామంలో తాగునీటి సమస్య తీర్చాలని జె.హోసళ్లి సాగునీటి సంఘం అధ్యక్షుడు కురువ మల్లన్న అన్నారు. గురువారం ఎంపీడీవో వరలక్ష్మికి విన్నవించినట్లు తెలిపారు.

ఫోన్‌కాల్స్‌పై జాగ్రత్త

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అపరిచితుల నుంచి ఫోన్ కాల్స్‌పై జాగ్రత్తగా ఉండాలని ఎస్‌ఐ విజయ కుమార్ నాయక్ సూచించారు. గురువారం జడ్పీ పాఠశాలలో సైబర్ మోసాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. హెచ్‌ఎం దేవేంద్రప్ప ఉన్నారు

మోసం చేసి అధికారంలోకి వచ్చారు

మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సాధ్యం కాని హామీలతో టీడీపీ నాయకులు ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చారనీ మాజీ ఎమ్మెల్యే కె.శ్రీదేవి, కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ ఛైర్మన్ రామచంద్రారెడ్డి ఆరోపించారు. గురువారం ఎం.అగ్రహారం గ్రామంలో మాజీ సర్పంచ్ గంపల వెంకటేశ్ స్వగృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలైనా సంక్షేమ పథకాలు అమలు చేయలేదన్నారు. అమ్మఒడి, సుఖీభవ, ఉచిత బస్సు సౌకర్యం, ఇలా ఎన్నో హామీలు నెరవేర్చలేదని తెలిపారు. ఎన్నికలు ఎప్పుడు జరిగినా మళ్లీ జగన్ సీఎం కావడం తథ్యమన్నారు. ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయ న్నారు. వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు పెడుతు న్నారనీ, కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. గిట్టుబాటు ధరలు లేక రైతులు ఆందోళన చెందుతున్నా పట్టించుకునే వారే లేరన్నారు. మద్యాన్ని విచ్చలవిడిగా అమ్ముతున్నారని, వీధికో షాపు ఏర్పాటు చేశారని ఆరోపించారు. మండల వైసీపీ అధ్యక్షుడు మల్లికార్జున యాదవ్, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మురళిధర్ రెడ్డి, వెంకటేశ్వర్లు, పెరవలి ఫక్కీరప్ప, కృష్ణ యాదవ్, వెంకటేశ్వ రరెడ్డి, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

చెరువుకు హంద్రీనీవా నీళ్లు



జలహారతి ఇస్తున్న నాయకులు

తుగ్గలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాతన చెరువుకు హంద్రీ నీవా నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మనోహర్ చౌదరి చెరువుకు జలహారతి ఇచ్చారు చెరువురే నీరు రావడంతో భూగర్బ జలాలు పెరిగే అవకాశముందన్నారు. ఏటా మూడు పంటలు పండించుకోవచ్చని తెలిపారు. ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబుకు రుణపడి ఉంటామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు, కృష్ణమూర్తి చౌదరి, ఈరన్న స్వామి, మాజీ సర్పంచ్ ఈశ్వరయ్య, షైరాముడు, పీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు, దేవేంద్ర పాల్గొన్నారు.

'సామాన్యులకు శాపంగా కేంద్ర బడ్జెట్'

ఆస్పరి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యులకు శాపంగా మారిందని సీపీఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి అన్నారు. గురువారం మాట్లాడుతూ కార్పొరేట్ వ్యక్తుల ఆస్తులను పెంచడానికే ఉపయోగపడుతుందన్నారు. నరేంద్ర మోడీ దేశంలో నిరుద్యోగ సమస్య పరిష్కరించలేదన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి తుంగలో తొక్కారన్నారు. బ్రహ్మయ్య, కృష్ణ, నల్లన్న, చంద్రశేఖర్, లక్ష్మన్న రామాంజిని పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో బాధితులకు మేలు

ఆదోని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయనిధి బాధితులకు మేలు చేస్తుందని ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో చికిత్స చేసుకున్న బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు. పట్టణంలోని పింజరిగేరికి చెందిన సయ్యద్ ఖాన్‌కు చికిత్సకు రూ.3.65లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేశారు. నాగరాజుగౌడ్, ఉపేంద్ర పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి



పూజలు చేస్తున్న ఉమాపతి నాయుడు

ఆదోని రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. గురువారం పాండవగల్లు గ్రామ దేవరల పాల్గొన్నారు. దేవమ్మ, బంగారమ్మకుపూజలు నిర్వహించారు. వైసీపీ ప్రభుత్వంతో రాష్ట్రం 20ఏళ్లు వెనక్కి వెళ్లిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చా రోడ్లు బాగుపడ్డాయన్నారు. కార్యకర్తలు అధైర్య పడొద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నాయకులు బసన్న, గణేకల్లు విరుపాక్షి, ఆరేకల్లు రామకృష్ణ, రంగస్వామి ఉన్నారు.

జర్నలిస్టులకు అక్రిడిటేషన్ ఇవ్వాలి

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ మంజూరు చేయాలని ఏపీ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (ఏపీడబ్ల్యుజేఎఫ్) కార్యదర్శి మద్దిలేటి డిమాండ్ చేశారు. గురువారం భీమాస్ హాల్లో నియోజకవర్గ అధ్యక్షుడు బసవ రాజు అధ్యక్షతన సభ్యత్వ నమోదును ప్రారంభించారు. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఇళ్ల స్థలాలు కేటాయించి ప్రభుత్వమే గృహాలు నిర్మించేలా చూడాలన్నారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. ఏపీడబ్ల్యూజేఎఫ్ జర్నలిస్టుల అండగా ఉంటుందన్నారు. గౌరవాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి మునెప్ప, ఉపాధ్యక్షుడు ఉరుకుందప్ప, మురళి, బీమా, రఘునాథ్, చంద్ర, వీరేష్, నుంకన్న పాల్గొన్నారు.

మెగా డీఎస్సీని ప్రకటించాలి

దేవనకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీని వెంటనే ప్రకటించాలని ఏఐవైఎఫ్ మండల అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలైనా డీఎస్సీ ప్రకటించకపోవడం దారుణమన్నారు. నిరుద్యోగులు కళ్లు కాయలుకాసేలా ఎదురు చూస్తున్నారన్నారు. శంకర్, నరేష్, నబీ రసూల్, నరసింహులు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్ నమోదు చేసుకోండి

వెల్దుర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అసంఘటిత కార్మికులు 'ఈ-శ్రమ్' గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని సహాయ కార్మిక అధికారి నీలిమ సంధ్య తెలిపారు. గురువారం ఉపాధి కార్యాలయంలో టెక్నికల్ , ఫీల్డు అసిస్టెంట్లకు ఈ-శ్రమ్ పోర్టల్ గురించి అవగాహన కల్పించారు. పొదుపు మహిళలు, అంగన్వాడీలు, తాపీవర్కర్లు, వ్యవసాయ కూలీలు, డ్రైవర్లు, టైలరింగ్ , చేపలు పట్టేవాళ్లు, మంగళి, చాకలి వివిధ అసంఘటిత కార్మికులు నమోదు చేసుకోవచ్చన్నారు. రూ.2 లక్షల బీమా, ఇతర ప్రయోజనాలు అందుతాయన్నారు. దగ్గర్లోని సచివాలయం, సీఎస్‌సీ, మీసేవా, కార్మికశాఖ కార్యాలయంలో నమోదు చేసుకోవాలన్నారు.

జర్నలిస్టుల సంక్షేమానికి కృషి

• ఎంపీ నాగరాజు, ఎమ్మెల్యే రామాంజినేయులు

ఆలూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేస్తామని ఎంపీ నాగరాజు, పత్తిపాడు ఎమ్మెల్యే రామాంజినేయులు, టీడీపీ ఇన్‌చార్జి వీరభద్ర గౌడ్ అన్నారు. గురువారం జర్నలిస్టు కాలనీని పరిశీలించారు. ప్రభుత్వం స్థలాలు ఉన్నవారికి ఇల్లు మంజూరు చేస్తుందన్నారు.

నేడు ఇంటర్వ్యూలు

తుగ్గలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. గురువారం మాట్లాడుతూ బీసీ, కాపు, ఈబీసీ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ కార్పొరేషన్లకు దరఖాస్తు చేసినవారు ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు, సర్టిఫికెట్లతో హాజరురావాలన్నారు.
పత్తికొండ టౌన్: మండలలో బీసీ కార్పొరేషన్ రుణాలకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సువర్ణలత తెలిపారు. గురువారం మాట్లాడుతూ మండ లంలో మొత్తం 17 గ్రామ పంచా యతీల్లో 1,200 దరఖాస్తులు వచ్చాయన్నారు.

మరమ్మతులు చేయాలి

తుగ్గలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శివాలయానికి మరమ్మతులు చేయాలని భక్తులు కోరారు. గురువారం ఆలయాన్ని జియో మైసూరు కంపెనీ డైరెక్టర్ మానసరంజన్ బిశ్వాల్, మేనేజర్ రామ్మోహన్ సోమిరెడ్డి పరిశీలించారు.

గిరిజనుల భాషా దినోత్సవాలు



పాల్గొన్న విద్యార్థులు

తుగ్గలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల బాష, వేషాధారణపై ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు కసూర్బా ప్రిన్సిపాల్ షాహీన్ తెలిపారు. గురువారం పాఠశాలలో గిరిజన బాషా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులకు గిరిజనుల వేషాధారణ, వారి బాషపై అవగాహన కల్పించారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తాం



గోకులం షెడ్లను ప్రారంభిస్తున్న పురుషోత్తం చౌదరి

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేస్తామని మాజీ జడ్పీటీసీ సభ్యుడు పురుషోత్తం చౌదరి, ఏపీవో నర్సిరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పెరవలి గ్రామంలో నారాయణ స్వామి, రాంబాబు, రంజాన్‌కు చెందిన రూ.2.30లక్షలు విలువ చేసే నాలుగు గోకులం షెడ్లను ప్రారంభించారు. టీడీపీ రైతుల ప్రభుత్వమని, రైతు సంపదను పెంచేందుకు గోకులం షెడ్లను మంజూరు చేసిందని తెలిపారు. కార్యదర్శి సుధాకర్, మాజీ సర్పంచ్ వెంకటవర్మ, టీడీపీ నాయకులు రామాంజనేయులు, ఆంజనేయ, మెడికల్ రాము, ఉపాధి సిబ్బంది రాఘవేంద్ర, షేక్షావలి తదితరులు ఉన్నారు.

పురపాలక స్థలాలను కాపాడాలి



పార్కు స్థలం వద్ద ఉన్న లేఅవుట్ బోర్డు

ఆదోని టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పురపాలక స్థలాలు కబ్జాకు గురికాకుండా రక్షించాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి కార్యదర్శి నూర్ అహమ్మద్ అన్నారు. బుధవారం మాట్లాడుతూ పట్టణంలోని జిమ్ రోడ్డులోని ఎల్‌ఐజి కాలనీలో ఆదిత్య నర్సింగ్ హోమ్ పక్కన పార్కు స్థలాన్ని కొందరు కబ్జాచేసి భవనం నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్‌తో పాటు ఆర్డీఓకి కూడా ఫిర్యాదు చేశామన్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి, ప్రహరీ నిర్మించాలని, బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.

అడిగినవారందరికీ 'ఉపాధి'

వెల్దుర్తి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తామని ఏపీడీ లక్ష్మన్న అన్నారు. గురువారం మండలంలోని నరసా పురం, సూదేపల్లె గ్రామాల్లో ఉపాధి పనులను తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లను పరిశీలించారు. అనంతరం వెల్దుర్తి ఉపాధి కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. జాబ్ కార్డు లేనివారికి జాబ్‌కార్డు నమోదు చేయాలని, పొలాల్లో ఫారంపండ్ గుంతలు, డ్రైనేజీ కాలువలు, ఇంకుడు గుంతలు, పండ్ల తోటల పెంపకాన్ని ప్రొత్సహించాలని తెలియజేశారు. ఏపీవో లక్ష్మన్న, ఈసీ రాజశేఖర్, టెక్నికల్, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

తుగ్గలి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని పూర్వ విద్యార్థి, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు అంగడి లోకేశ్ కోరారు. గురువారం జిల్లా పరిషత్ పాఠశాలలో మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని, సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న అధికారులు

రుణాలకు ఇంటర్వ్యూలు

దేవనకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): బీసీ కార్పోరేషన్ రుణాలకు ఎంపీడీవో కార్యాలయంలో గురువారం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 50 యూనిట్లు ఉండగా, 1,750 మంది దరఖాస్తు చేశారు. 730 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరైనట్లు ఎంపీడీవో సూర్యానారాయణ తెలిపారు. పరిపాలనాధికారి నాగమ్మ, తెర్నేకల్, పి.కోటకొండ, కప్పట్రాళ్ల, దేవనకొండ బ్యాంకు అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

భవిష్యత్తుకు బాటలు వేయాలి

మద్దికెర, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేయాలని ఎంఈవో-2 గోపాల్, రీసోర్స్ పర్సన్లు లక్ష్మీనారాయణ, లీలావతి సూచించారు. గురువారం జడ్పీ బాలుర పాఠశాలలో జ్ఞానజ్యోతి శిక్షణ ముగించారు.ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌభాగ్యలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

డీఎస్సీని ప్రకటించాలి

పత్తికొండ టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం తక్షణమే మెగా డీఎస్సీని ప్రకటించాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమేష్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఆర్ భవన్‌లో మాట్లాడారు.

ఎల్ఐసీలో ఖాళీలను భర్తీ చేయాలి



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఆదోని అగ్రికల్చర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ సంస్థలో ఖాళీలను భర్తీ చేయాలని ఉద్యోగుల సంఘం ఆదోని ప్రధాన కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. గురువారం ఉదయం గంటపాటు ఎల్ఐసీ ఉద్యోగులు నిరసన తెలిపారు. కేంద్ర ప్రభుత్వం, ఎల్ఐసీ యాజమాన్యం ఏకపక్ష దోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. జవాబుదారీతనం లేని ఔట్సోర్సింగ్ నియామకాలు చేపట్టరాదన్నారు. ఈయూను గుర్తింపు సంఘం హోదాను పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ, ఈరన్న, తిప్పన లియాపీ సభ్యులు సిద్ద లింగా, రామకృష్ణ, ధర్మరాజు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి

ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని సోగనూరు రోడ్డులో ఉన్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు కళ్లద్దాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చిన్న వయస్సులోనే విద్యార్థులకు కంటి సమస్యలు రావడం బాధాకరమన్నారు. అయినప్పటికి ప్రభుత్వం ముందుగానే గుర్తించి అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని 18 పాఠశాలలకు చెందిన 9,882 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించామన్నారు. వీరిలో కంటిచూపు సమస్య ఉన్న 382మంది విద్యార్థులను గుర్తించి వారికి ప్రభుత్వం ఉచితంగా కంటి అద్దాలు అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో సత్యవతి, జిల్లా అధికారి సంధ్యారెడ్డి, ఎంఈవో మధుసుదన్‌రాజు, గోవిందరాజులు, టీడీపీ నాయ కులు రంగస్వామిగౌడు, అమాన్ పాల్గొన్నారు.

దేవిబెట్ట గ్రామాభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే

ఎమ్మిగనూరు రూరల్: మండలంలోని దేవిబెట్ట గ్రామాభివృద్ధికి కృషి చేస్తామని ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వరరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దేవిబెట్ట గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు చేయాలని పంచాయతీరాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. అలాగే గ్రామంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టి గ్రామాన్ని శుభ్రంగా ఉంచాలని ఎంపీ డీవో బంగారమ్మ, ఈవోపీఆర్డీ విజయలక్ష్మీలను ఆదేశించారు. అలాగే కొంతమంది ప్రజలు తాగునీటి సమస్యను ఆయన దృష్టికి తీసుకురాగా వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ టీడీపీ నాయకులు దేవిబెట్ట సోమేశ్వరరెడ్డి, రాముడు, నాగరాజు గౌడు, జగదీష్‌స్వామి, మహాదేవప్పస్వామి, గిర్డి సోమశేఖర్‌రెడ్డి, మండల నాయకులు కెటి. వెంకటేశ్వర్లు, సోగనూరు జగదీష్, రాఘవేంద్ర, బోడ బండ సురేష్, నరసన్నగౌడు, తహసీల్దార్ శేషఫణి, పీఆర్ ఏఈ జయన్న పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

మిరప రైతులను ఆదుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కోసిగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలో మిరప పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ ఆధ్వర్యంలో రైతులు తహసీల్దార్ రుద్రగౌడుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం మండల కార్యదర్శి వీరేష్ మాట్లాడుతూ మండలంలో వందలాది మంది రైతులు మిరప పంటను సాగు చేశారని, అయితే.. ఎకరాకు రూ.2 లక్షల వరకు పెట్టుబడి పెట్టారని, మిరప దిగుబడి లేక గిట్టుబాటు ధర లేకపోవ డంతో రైతులు లక్షలు నష్టపోయారని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం మిరప పంటకు గిట్టుబాటు ధర కల్పించి నష్టపోయిన మిరప రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు పూజారి శ్రీనివాసులు, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు, రైతులు ఈరన్న, కోసిగయ్య, పోతుల మూసయ్య హనుమంతుప్రకాష్, రామకృష్ణ, పాల్గొన్నారు.

'ఎంఈవోపై చర్యలు తీసుకోవాలి'

మంత్రాలయం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం ఎంఈవో షైనుద్దీన్‌పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి థామస్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ అంగన్‌వాడీ టీచర్లకు సమావేశం కోసం ఒక్కో టీచరుకు ప్రభుత్వం రోజువారీగా రూ.400 ఇస్తున్నప్పటికీ రూ.100 ఖర్చు చేయకుండా అంగన్ వాడీ టీచర్ల డబ్బులను తమ ఖాతాల్లో వేసుకుంటున్నారని ఆరోపించారు. అదేవిధంగా ఎంఆర్‌సీ నిర్వహణ కోసం రూ.1.30 లక్షలు విడుదలైనప్ప టికీ ఎందుకు ఖర్చు చేశారో చెప్పడం లేదని వాపోయారు.

శ్రీమఠం గోశాలకు విరాళం

మంత్రాలయం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్రస్వామి మఠానికి బెంగళూరుకు చెందిన శాంత బాయి అనే భక్తురాలు రూ.50వేలు గోశాలకు విరాళం ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జ్యోషి, సురేష్‌కోణాపూర్ లు తెలిపారు. గురువారం కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.50 వేలు నగదును గోశాలకు విరాళం ఇచ్చినట్లు తెలిపారు. దాత కుటుంబానికి పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు.

'వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలని సంఘం జిల్లా అధ్యక్షుడు అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండులు డిమాండ్ చేశారు. గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించి వాల్మీకుల శాశ్వత సమస్యను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాజు, వీరాంజనేయులు, రామకృష్ణ, పూర్ణనాయుడు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో దొంగలు

ఎమ్మిగనూరు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలోని ఎద్దుల మార్కెట్ ప్రాంతం, బంగారు బజారుకు వెళ్లే రహదారిలో ఉన్న దుస్తుల దుకాణాల్లో బుధవారం దొంగతనాలకు పాల్పడిన ఇరువురి మహిళలను పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎద్దుల మార్కెట్ ప్రాంతంలో ఉన్న దుకాణంలో చీరలు కొనుగోలు చేస్తే కస్టమ ర్లుగా వెళ్లి దుకాణాదారుల కళ్లుగప్పి కొన్ని చీరలు దొంగలించారు. అలాగే షరఫ్ బజారులో ఉన్న రెడ్‌మెడ్ దుకాణంలో కూడా దుస్తులను కొనుగోలు చేస్తున్నట్లు నటిస్తూ దొంగతనానికి పాల్పడ్డారు. దొంగలించిన దుస్తులను దుకాణం బయట ఉన్న ఓ వృద్ధురాలికి ఇచ్చి ఆటో ఎక్కి పారిపోతుండగా దుకాణాదా రులు వెంబడించి సున్నంబట్టి వీధి ప్రాంతంలో పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారిస్తున్నారు.

నేడు బీసీ కార్పొరేషన్ రుణాల లబ్ధిదారుల ఎంపిక

గోనెగండ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తున్న వారు శుక్రవారం ఉదయం ఎంపీడీవో సమావేశ భవనంలో బ్యాంక్‌మేనేజర్ల సమావేశానికి హాజరుకావాలని ఎంపీడీవో మణిమంజరి కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారు శుక్రవారం ఉదయం 10.30 నిమిషాలకు హాజరుకావాలన్నారు. లబ్ధిదారులు తమ దగ్గర ఉన్న ధృవీకరణ పత్రాలను తీసుకురావాలన్నారు. శుక్రవారం ఉదయం ఆంధ్రప్ర గతి గ్రామీణ బ్యాంక్ తెర్నెకల్‌కు సంబంధించిన బీ.అగ్రహారం, బైలుప్పల, గంజహళ్లి గ్రామాల దరఖాస్తుదారులు, కెనరా బ్యాంక్ పెద్దనేల టూరుకు సంబంధించిన అలువాల, పెద్దనేలటూరు గ్రామస్థులు, కెనరా బ్యాంక్ వర్కూర్‌కు సంబంధించిన ఎర్రబాడు, కున్నూరు, ఎస్ లింగందిన్నె, కెనరాబ్యాంక్ హెచ్ కైరవాడికి సంబంధించి హెచ్ కైరావాడి, యాక్సిస్ బ్యాంక్ వేముగోడుకు సంబంధించి తిప్పనూరు, వేముగోడు గ్రామాలకు సంబంధించిన దరఖాస్తుదారులు శుక్రవారం హాజరుకావాలని కోరారు. అలాగే గోనెగండ్ల ఎస్‌బీఐ బ్యాంక్‌కు సంబంధించిన గోనెగండ్ల, ఐరన్‌బండ, కులుమాల, నెరుడుప్పల, పెద్దమరివీడు గ్రామాల కు చెందిన దరఖాస్తుదారులు శనివారం హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

ఏపీజీబీని కడపలోనే కొనసాగించాలి


నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

మంత్రాలయం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోనే కొనసాగించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. గురువారం మంత్రాలయం తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు బ్యాంకులను ఒకే బ్యాంకుగా ఏర్పాటు చేస్తుందని, అయితే ప్రధాన కార్యాలయం కడపలోనే ఉండాలని డిమాండ్ చేశారు. రిజర్వ్ బ్యాంకు సూచనల మేరకు ఏదీ పెద్ద బ్యాంకు ఉంటే అక్కడే ప్రధాన కార్యాలయంగా కొనసాగించాల్సి ఉంటుందన్నారు. కొంత మంది ఉన్నతాధికారులు అమరావతికి మార్చాలని ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీఐటీయు మండల కార్యదర్శి జయరాజు, ప్రాణేష్, ఈరన్న, లక్ష్మన్న, అంజి, రాజు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి అన్యాయం: సీపీఎం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో ఏపీకి తీరని అన్యాయం జరిగిందంటూ సీపీఎం ఆధ్వర్యంలో సోమప్ప సర్కిల్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి గోవిందు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బడ్జెట్ కేటాయించకపోవడం అన్యాయమన్నారు. అదేవిధంగా సాగునీటి ప్రాజెక్టులకు నిధుల కేటాయించకపోవడం దారుణమన్నారు. కార్యక్ర మంలో సీపీఎం తాలుకా కార్యదర్శి రాముడు, అబ్దుల్లా, సురేష్, రమేష్, తిమ్మన్న పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలి


మాట్లాడుతున్న పుల్లన్న

గోనెగండ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వచ్చే డీఎస్సీలో సమగ్ర శిక్ష ఉద్యోగులకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఆర్‌పీ ఉద్యోగుల సంఘం నాయకుడు పుల్లన్న కోరారు. గురువారం ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ సమగ్ర శిక్షలో వివిధ విభాగాల కింద సీఆర్‌ఎంటీ, ఎంఐఎస్, డీటీపీ, ఐఈఆర్‌టీ పీఆర్‌టీ, మెసెంజర్, అకౌంట్స్‌లలో 13 ఏళ్లుగా పనిచేస్తున్నామని, అయితే గత ప్రభుత్వం కనీస వేతనం హెచ్‌ఆర్ పాలసీ ఎంటీఎస్ అమలు చేయకపోగా పని ఎక్కువ జీతం తక్కువ అన్నరీతిలో జరుగుతుందని ఆయన అన్నారు. వచ్చే డీఎస్సీలో ప్రాధాన్యత మార్కుల కింద గరిష్ఠంగా పది మార్కులు కేటాయిచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఘనంగా బంగి అయ్యప్పతాత ఉరుసు


బంగి అయ్యప్ప తాత సమాధికి భక్తులు వేసిన పూలమాలలు

కోసిగి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మూగలదొడ్డి గ్రామంలో బంగి అయ్యప్ప తాత ఉరుసు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. మూడేళ్లకు ఒకసారి ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గురువారం గ్రామంలో భక్తులు పూలమాలలు, జెండాతో ర్యాలీగా బంగి అయ్యప్పతాత సమాధి వరకు వెళ్లారు. అనంతరం ముల్లసాబ్‌లు, ఫక్కీర్‌సాబ్‌లు మొఖం దవడలో ఇనుప చివ్వలు గుచ్చుకుని విన్యాసాలు ప్రదర్శించారు.

నూతన నియామకాలు చేపట్టాలి



సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులు

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీలో నూతన నియామకాలు చేపట్టాలని ఆ సంఘం (ఏఐఐఈ) బ్రాంచ్ అధ్యక్షులు వెంకటేశ్వర్లు, కార్యదర్శులు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఎల్ఐసీ పరిరక్షణ కోసం ఉద్యోగులు దేశవ్యాప్తంగా గంటసేపు ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో మహేష్ కుమార్, ప్రతాప్, రామకృష్ణ, రాముడు, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

మంత్రాలయంలో భక్తుల సందడి

మంత్రాలయం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాఘవేంద్ర స్వామి దర్శనార్థం వచ్చిన భక్తులతో మంత్రాలయం సందడిగా మారింది. గురువారం రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన దినం కావడంతో దక్షణాది రాష్ట్రాలైన ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్ర నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. దీంతో మఠం ప్రాంగణం భక్తులతో కిక్కిరిసింది. అన్నపూర్ణ భోజనశాల, మహాముఖద్వారం, మధ్వమార్గ్ కారిడార్, ప్రధాన రహదారులు, రాఘవేంద్ర సర్కిల్, నదితీరం భక్తులతో కోలాహలంగా మారింది. గ్రామదేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు పీఠాధిపతుల ఆశీస్సులు పొందారు. భక్తుల రద్దీ పెరగడంతో లాడ్జిలు, హోటళ్లు, పూజా సామగ్రికి డిమాండ్ పెరిగింది.


మఠం ప్రాగంణంలో రద్దీగా ఉన్న భక్తులు

ప్రహ్లాదరాయల వెండి రథోత్సవం: రాఘవేంద్ర స్వామి మఠంలో ప్రహ్లాదరాయలు వెండి రథంపై భక్తులకు దర్శనమిచ్చారు. పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల ఆధ్వర్యంలో అర్చకులు బృందావనానికి పూజలు నిర్వహించారు. పూర్ణబోధపూజ మందిరంలో ఉత్సవమూర్తికి పాదపూజ చేసి పల్లకిలో ఊరేగించారు. పీఠాధిపతి స్వహస్తాలచే మూలరాములు, జయరాములు, దిగ్విజయరాములకు బంగారు నాణేలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రహ్లాదరాయలను వెండి రథంపై అధిష్ఠించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం ఊంజలసేవ నిర్వహించారు. పీఠాధిపతి భక్తులకు శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వాదించారు.

హామీలను అమలు చేయాలి

ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ



మాట్లాడుతున్న ఈరమ్మ

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి ఈరమ్మ డిమాండ్ చేశారు. గురువా రం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు హామీలు అమలు చేయలేదన్నారు. తల్లికి వందనం అంటూ చదువుతున్న ప్రతి విద్యార్థికి రూ.15వేలు, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 19 నుం చి 59ఏళ్ల మహిళలకు నెలకు రూ.1500, రైతులకు పెట్టుబడి సాయం, సంవత్సరానికి రూ.20వేలు, నిరుద్యోగ భృతి నెలకు రూ.3వేలు వంటి ప్రధాన హామీలు ఇచ్చి ఇప్పటి వరకు అమలు చేయలేదన్నారు. సూపర్ సిక్స్ పథకాల పేరుతో మహిళల ఓట్లను దోచుకున్నారన్నారు. ఈ సమావేశంలో ఛాముండి, రేణుకా, లక్ష్మి, నాగవేణి, పద్మ, రంగమ్మ, వెంకటేశ్వరమ్మ, సరోజ, వీరమ్మ పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి: సీఐ


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ రామాంజులు

మంత్రాలయం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక దశ నుంచి విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని మంత్రాలయం సీఐ రామాంజులు అన్నారు. గురువారం చిలకలడోన జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. పొలం తగాదాలు, దొంగతనాలు, పేకాట, మద్యం, మహిళ నేరాలు, సైబర్ నేరాలు వంటివి జరుగుతున్న విధానాలను వివరించారు ప్రతి విద్యార్థి తమ తల్లిదం డ్రులకు అవగాహన కల్పిస్తే నేరాలు అదుపులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం జాన్సన్, ఉపాధ్యాయులు నాగరాజు, భీమన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి బయలు దేరిన శివస్వాములు


ఇరుముడితో శ్రీశైలానికి బయలు దేరుతున్న శివస్వాములు

నందవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముగతి గ్రామంలో 40 రోజుల పాటు దీక్ష నిర్వహించిన, అలాగే అర్థ మండలం దీక్ష వేసిన శివ భక్తులు గురువారం కాలినడకన శ్రీశైలానికి బయలు దేరారు. ఉదయమే అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసారు. అనంతరం గ్రామంలో శివభక్తులను ఊరిపోలి మేర వరకు చిన్నారులు కలశాలతో ఊరేగించారు. టీడీపీ గ్రామ అధ్యక్షుడు భార్గవ్ యాదవ్ భక్తుల కోసం 3 వాహనాలు ఏర్పాటు చేశారు.

నెరుడుప్పల రహదారికి మరమ్మతులు చేయండి

గోనెగండ్ల, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాజుల దిన్నె ప్రాజెక్టు క్రాస్ రోడ్డు నుంచి పిల్లిగుండ్ల, నెరుడుప్పల, బండగట్టు ప్రధాన రహదారి గుంతమయంగా మారింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని అనేక సార్లు అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతలు పడిన రోడ్డు

ఔషధ మొక్కల పెంపకంపై దృష్టి సారించాలి

కేవీకే ప్రధాన శాస్త్రవేత్త రాఘవేంద్ర చౌదరి


రైతులకు ఔషధ మొక్కల విత్తనాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

ఎమ్మిగనూరు రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఔషధ మొక్కల పెంపకంపై రైతులు దృష్టి సారించాలని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్రచౌదరి సూచించారు. గురువారం మండలంలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో రైతులకు ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథులుగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి, శాస్త్రవేత్త జ్ఞానేష్, అటవీ శాఖ అధికారి రామచంద్రుడు, ఆయూష్ మెడికల్ అధికారి స్వర్ణలతలు పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రాఘవేంద్రచౌదరి మాట్లాడుతూ ఏపీ ఔషధ, సుగంధ మొక్కల బోర్డు నర్సరీల ద్వారా రైతులకు ఉచితంగా మొక్కలను అందజేస్తుందన్నారు. పంటలను నిల్వ ఉంచుకునేందుకు గోడౌన్‌లను నిర్మించి ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వై.మౌనిక, అశ్వగంధం జాతీయ రైతు అవార్డు గ్రహిత కొండయ్య, మెడిషనల్ ప్లాంట్ బోర్డు సభ్యులు విజయ్ కుమార్, కృష్ణశ్రీ, ప్రణీత, హార్టికల్చర్ అధికారి నాగరాజు, అన్నదాత రైతు ఉత్పత్తి దారుల సంఘం అధ్యక్షుడు పొనకలదిన్నె శ్రీరాములు, రైతులు పాల్గొన్నారు.

గడ్డి వాములు దగ్ధం.. రూ.2 లక్షల నష్టం


మిట్టాసోమాపురంలో కాలిపోతున్న గడ్డి వాములు

నందవరం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టాసోమాపురం గ్రామంలో గురువారం ఐదు గడ్డి వాములు దగ్ధమయ్యాయి. గ్రామంలోని తెలుగు రామలింగడువి 3 గడ్డివాములు, ఆరెకంటి పురుషోత్తం 1, నాగరాజు 1 గడ్డి వాములకు గుర్తుతెలియని వ్యక్తి నిప్పంటించారని బాధితులు ఆరోపిస్తున్నారు. దాదాపు రూ.2లక్షలు నష్ట వాటిల్లిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు విచారించి న్యాయం చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం వారిని ఆదుకోవాలని ఎంపీటీసీ లక్ష్మీ, వీరేష్, రామలింగడు, భాస్కర్ కోరారు.

కాటికాపరుల సమస్యలపై ఉద్యమించాలి


మాట్లాడుతున్న ఎండీ ఆనందబాబు

మంత్రాలయం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాటికాపరుల సమస్యలపై ఉద్యమించాలని సంఘం రాష్ట్ర నాయకులు ఎండీ ఆనందబాబు పిలుపునిచ్చారు. గురువారం మంత్రాలయం స్థానిక అతిథి గృహంలో కాటికాపరుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 28న కర్నూలులో జరిగే జిల్లా సదస్సుకు కాటికాపరులు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. తరతరాలుగా శ్మశానంలో కాటికాపరులుగా వృత్తి చేస్తున్నా.. ప్రభుత్వాలు ఈ వృత్తిని గుర్తించకపోవడం సిగ్గు చేటన్నారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జయరాజు, మండల కార్యదర్శి గర్జి అంజి, వీరేష్, అనిల్, మారెప్ప, రాజు, నరసన్న పాల్గొన్నారు.

దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాల పరిశీలన

ఎమ్మిగనూరు టౌన్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు గత ప్రభుత్వం ఇచ్చిన ధ్రువీకరణ పత్రాలను అనంతపురం నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందం ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో గురువారం పరిశీలించారు. పించన్లు తీసుకుంటున్న దివ్యాంగులకు జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి అర్హులకు పత్రాలను జారీ చేశారు. ఇందులో దివ్యాంగులు అధిక సంఖ్యలో పాల్గొని ధ్రువీకరణ పత్రాలను పొందారు.